## నీలగిరి నిత్యపద్యం

మానవత్వమున్న మరిచి బంగాళున
రాక్షసులను బోలె కక్షబూని
హిందు వర్గ ప్రజల హింస ప్రవృత్తితో
చంపి తగల బెట్టె జాలి లేక
మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దినపత్రిక



**విలేకరులు కావలెను**

నీలగిరి ఎక్స్‌ప్రెస్ దినపత్రిక మరియు చైతన్యగళం ఛానెల్ లో పనిచేయుటకు మండల విలేఖర్లు, నియోజకవర్గ,జిల్లా ఇంచార్జీలు, క్రైమ్ రిపోర్టర్లు కావలెను.

**పూర్తి వివరాలకు**

తెలంగాణ - 9705770909,
ఆంధ్రప్రదేశ్ -9491163914
లను సంప్రదించగలరు.



సంచిక 46 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం | ఆగస్టు 14, 2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


## పదేళ్ల బిఆర్ఎస్..రెండేళ్ల కాంగ్రెస్ పాలనను

# బేరీజు వేయండి

- గత పథకాలకు తోడు సంక్షేమాన్ని రెట్టింపు చేసాం
- రాష్ట్రం ఎండిపోవాలని కుట్రలు చేశారు
- వారు చేసిన చేతబడి తిరగబడింది
- నగరంలో పేదలకు లక్ష ఇళ్లు నిర్మిస్తున్నాం
- ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపనలో సిఎం రేవంత్





**హైదరాబాద్,ఆగస్టు 13 :** పదేళ్ల బీఆర్ఎస్, రెండేళ్ల కాంగ్రెస్ పాలనను ప్రజలు బేరీజు వేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. గతంలో ఉన్న పథకాలకు అదనంగా సంక్షేమాన్ని అందిస్తున్నా మని చెప్పారు. హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి సీఎం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేదల రుణం తీర్చుకునే అవకాశం వచ్చిందని.. ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై సీఎం విమర్శలు చేశారు. రాష్ట్రం ఎండిపోవాలని కుట్ర చేశారని ఆరోపించారు. చేతబడుల కోసం కొందరు కర్ణాటక వెళ్లారు. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు కేసీఆర్ పరిస్థితి ఉంది. అందుకే అల్లుడు క్షుద్రపూజలు మిగతా2లో...



## పిల్లల ఆరోగ్యంపై

# ఆటలొద్దు

● ఆహార పదార్థాల ప్యాకెట్లపై లేబుల్ వేయాల్సిందే ● మీతో కాకపోతే మేమే ఆ పని చేస్తాం ● కేంద్రానికి సుప్రీం కోర్టు చురకలు

**న్యూఢిల్లీ,ఆగస్టు 13 :** అధిక మోతాదులో ఉప్పు, చక్కెర, సంతృప్త కొవ్వులు ఉండే ఆహార పదార్థాల ప్యాకెట్‌లపై లేబుల్స్ ఏర్పాటు చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు గురువారం గట్టి హెచ్చరిక చేసింది. 'మీరు చేయలేకపోతే మేమే చేస్తాం' అంటూ కేంద్రానికి తేల్చి చెప్పింది. ప్రజల ఆరోగ్యానికి, ముఖ్యంగా పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో కార్పొరేట్ ఒత్తిళ్లకు తలొగ్గకూడదని స్పష్టం చేసింది. జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ అంశంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది. ఆహార పదార్థాలపై హెచ్చరిక లేబుల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఈ÷ూంఎ) వ్యవహరిస్తున్న తీరుపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అధిక చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వుల గురించి అవగాహన కలిగించేందుకు ప్యాకెట్‌ల ముందు భాగంలో స్పష్టమైన హెచ్చరికలు ఉండాలని మిగతా2లో...

## త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు

- దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి



2లో

## ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

- వందేమాతరం గీతాలాపనతో లోక్‌సభ వాయిదా



2లో

## వచ్చే ఏడాది ఇందిరమ్మ టవర్స్ నుంచే బోనాలు ఎత్తిస్తాం

● ఎటువంటి లాలూచీ లేకుండా పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు. ● గత ప్రభుత్వం పేదలను దోచుకుంటే ...మేం ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నాం: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్,ఆగస్టు 13 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నేడు శంకుస్థాపన చేసుకున్న ఇందిరమ్మ టవర్స్ నుంచి వచ్చే ఏడాది బోనాలు ఎత్తిస్తామని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. గురువారం సాయంత్రం కూకట్‌పల్లిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన సభకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆనాటి ప్రభుత్వం కమిషన్లు రావన్న కారణంగా పేదలకు ఇళ్ళు కట్టలేదని, కమిషన్లు మిగతా2లో...



2లో

## అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఖేలో ఇండియా క్రీడల నిర్వహణ

కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయతో వాకిటి శ్రీహరి

## బిసి మహిళలకు స్వయం ఉపాధి

ఉచిత కుట్టుమిషన్లు ప్రారంభించిన మంత్రి పొన్నం



**హైదరాబాద్,ఆగస్టు 13 :** బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలనలో బీసీ మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని పొన్నం చెప్పారు. బీసీ మహిళలకు మిగతా2లో...

## మైనార్టీ రిజర్వేషన్లు కల్పించిన

# ఘనత కాంగ్రెస్‌దే

- కొందరు 4శాతం రిజర్వేషన్లపై కోర్టు మెట్లెక్కారు
- ఇంటింటికీ వెళ్లి ఓట్ల గల్లంతును పరిశీలించండి
- మైనార్టీల ప్రతిభా సదస్సులో సిఎం రేవంత్ రెడ్డి




**హైదరాబాద్,ఆగస్టు 13 :** ముస్లిం మైనారిటీ రిజర్వేషన్లు అడ్డుకునేందుకు కొన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ముస్లింలకు కాంగ్రెస్ 4 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, వీటిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రిజర్వేషన్ల రద్దు కోసం అత్యున్నత న్యాయస్థానాల వరకూ వెళ్లారని ముఖ్యమంత్రి విమర్శించారు. అయినా చిత్తశుద్ధితో కాంగ్రెస్ అమలు చేసిందన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మిగతా2లో...

# పదేళ్ల బిఆర్ఎస్..రెండేళ్ల కాంగ్రెస్ పాలనను బేరీజు వేయండి

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. మీరు చేసిన చేతబడి మీపైనే తిరగబడి అష్టదిగ్బంధనం చేస్తుంది. ఫాంహౌస్ నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి వస్తుంది. నా సంకల్పం రాష్ట్రం బాగుకోసం.. అందుకే వర్షాలు పడుతున్నాయి. పదేళు అధికారంలో ఉన్నవారు చేతబడులు చేయిస్తారా? అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు అండగా ఉంటానన్నారు. కూకట్‌పల్లి ప్రజలకు కావాల్సిన పనులు చేయించాలని మంత్రులను ఆదేశిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. మహిళలకు ఉచిత బస్సు పథకం కింద రూ.12వేల కోట్లు చెల్లించాం. మహిళా సంఘాలకు రూ.65వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించాం. మహిళలకు ఉచిత బస్సు పథకం బంద్ చేయించాలని విపక్ష నేతలు ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టారు. 55 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. రాష్ట్రంలో కోటి మంది ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలు అందించాం. మహిళా సంఘాలకు వెయ్యి ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేసి ఇచ్చాం అని రేవంత్ అన్నారు. ఆనాడు నేను పార్లమెంట్ సభ్యుడిగా పోటీ చేస్తే కూకట్ పల్లి ప్రజలు నన్ను ఆశీర్వదించి గల్లీ నుంచి ఢిల్లీకి పంపారని గుర్తు చేసుకున్నారు. ప్రతిపక్షంలో ఉండగా గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో మీరు ఆశించిన మేరకు అభివృద్ధి చేయలేకపోయానన్నారు. కానీ ఇప్పుడు కూకట్ పల్లిని అభివృద్ధి చేసుకునేందుకు అన్ని రకాల అధికారం ఉందన్నారు. మీకు ఎలాంటి అభివృద్ధి కావాలన్నా అడిగి చేయించుకోండి. కూకట్ పల్లి నియోజకవర్గాన్ని ప్రతీక దృష్టితో అభివృద్ధి చేయాలని శ్రీధర్ బాబు గారిని ఆదేశిస్తున్నానని అన్నారు. పదేళ్ల వారి పరిపాలన రెండేళ్ల మా పాలనను బేరీజు వేసుకోండి. తెలంగాణలో 3 కోట్ల 28 లక్షల మందికి సన్నబియ్యం అందిస్తున్నాం. ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని పెంచేలా ఇందిరమ్మ చీరలను సారెగా అందించాం. పెట్రోల్ బంకులు, సోలార్ ఎ÷-లాంట్లు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాం స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను విక్రయించుకునేందుకు శిల్పారామంలో స్టాళ్లను ఇచ్చాం ఒకవైపు గత ప్రభుత్వం చేసిన అప్పులను చెల్లించుకుంటూనే.. మరోవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం అని సిఎం వివరించారు. డబ్బా ఇండ్లు వద్దు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామన్న వాళ్లు మీలో ఒక్కరికైనా ఇల్లు ఇచ్చారా అని ప్రశ్నించారు. పట్టణంలో పేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని మా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ కు శ్రీకారం చుట్టింది. మొదటి విడతలో లక్ష ఇండ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. మీ సొంతింటి కలను నిజం చేసేందుకు మీ సోదరుడిగా మీకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకెళుతున్నాం అని వివరించారు. 22-ఎ భూముల అంశంపై ఆయన మాట్లాడారు. మీరు కొనుగోలు చేసిన భూమి పొరపాటున 22-ఎలో పడితే ఆ భూమిని మీకే ఇప్పిస్తాను. ఈ విషయంలో నాదీ పూచీ. సమస్య ఉన్న ఒక సర్వే నంబర్‌లో 500 ఎకరాలు ఉంటే అన్నీ నిషేధిత జాబితాలో పెట్టారు. సబ్ నంబర్లు ఇచ్చి సమస్యను పరిష్కరిస్తానని సీఎం తెలిపారు.

# వచ్చే ఏడాది ఇందిరమ్మ టవర్స్ నుంచే బోనాలు ఎత్తిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

వచ్చే కాళేశ్వరం ప్రాజెక్టుపైనే దృష్టి సారించిందని ఆరోపించారు. దీనికి భిన్నంగా ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం ఎకరా 200 కోట్ల రూపాయల వరకు ఉన్నప్పటికీ హైదరాబాద్ మహానగరంలో పెద్ద పెద్ద టవర్స్ పక్కనే పేదలకు కూడా ఇళ్లు నిర్మించాలని నిర్ణయించి ఆచరణలోకి తెచ్చిందన్నారు. హస్తం పార్టీ రాష్ట్ర ప్రజలకు నేస్తమని మంత్రి గుర్తుచేస్తూ ఈ ప్రభుత్వం తల తాకట్టు పెట్టి అయినా పేదలకు ఇళ్ల నిర్మాణం నిరంతర పక్రియగా చేపడుతుందన్నారు. తొలివిడతగా లక్ష ఇళ్ల నిర్మాణానికి సంకల్పించామని దీనికి సంబంధించి ఇప్పటి వరకు 51 వేల దరఖాస్తులు వచ్చాయని, మరో రెండు రోజుల్లో దరఖాస్తులు స్వీకరణ గడువు ముగుస్తుందని అన్నారు. ఆ కార్యక్రమం తర్వాత అందరి సమక్షంలో ఎటువంటి లాలూచీలు లేకుండా పారదర్శకంగా మంత్రులతో సైతం ఎవరి సిఫార్సులు లేకుండా అందరి ముందు లక్కి డిప్ తీసి ఇళ్లను కేటాయిస్తామని చెప్పారు. లబ్దిదారులకు ముందే ఇళ్ల వివరాలను అందిస్తాం కాబట్టి వారు దగ్గరుండి కాంట్రాక్టర్ తో నాణ్యంగా తమ ఇళ్ళను కట్టించుకోవచ్చునని సూచించారు .ఇటువంటి బృహత్తర కార్యక్రమాన్ని గత ప్రభుత్వ పాలకులు జీర్ణించుకోలేక కక్షపూరితంగా గుడ్డ కాల్చి నెత్తిన వేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల ఇళ్ల గృహప్రవేశాలు పూర్తయ్యాయని గుర్తు చేస్తూ గత ప్రభుత్వం పదేళ్లలో నిర్మించిన ఇళ్ల కంటే మరో రెండున్నర ఇళ్లలో మూడింతలు ఎక్కువగా ఇళ్లు నిర్మిస్తామని ,అది చేయకపోతే తాను శాసనసభకు పోటీ చేయనని మరోసారి మంత్రి పొంగులేటి ప్రకటించారు. గతంలోనే ఈ ఛాలెంజ్ విసిరినప్పటికీ కిందర్ కింగ్ దీన్ని స్వీకరించలేదని, ఆయన నుంచి ఎటువంటి స్పందన లేదని అన్నారు. అంతేగాక సొల్లు పురాణం సొల్లు కథలు చెబుతూ పేదలను పేదల ఆత్మగౌరవాన్ని కించపరుస్తున్నారని అన్నారు. ఈ ప్రాంతంలో కొన్ని భూములు నిషేధిత జాబితాలో ఉన్నట్లు శాసనసభ్యులు తమ దృష్టికి తీసుకువచ్చారని అవి ప్రభుత్వ భూములు కాకపోతే రెండు రోజుల్లోనే ఆ భూములపై నిషేధం తొలగిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

# పంద్రాగస్టు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి

**ప్రోటోకాల్‌ను తప్పక పాటించాలి**

**విద్యుత్, త్రాగునీరు, ఇతర సదుపాయాలు సమకూర్చాలి**

**అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలి**

**అధికారులకు దిశానిర్దేశం చేసిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్**



**హైదరాబాద్,ఆగస్టు 13 :** రవాణా, ఆర్ అండ్ బి శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ పంద్రాగస్టు స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శనివారం గోల్కొండ కోటలో నిర్వహించనున్న స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు జరిగే ప్రాంతాన్ని గురువారం సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి ఆయన పరిశీలించి, ఏర్పాట్లపై దిశానిర్దేశర చేశారు. వర్షాకాలం నేపథ్యంలో కార్యక్రమంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా వాటర్‌ప్రూఫ్ షామియానాలు, వాటర్‌ప్రూఫ్ జనరేటర్, నిరంతర విద్యుత్ సరఫరా, త్రాగునీరు, బారికేడింగ్, గ్యాలరీలు, వచ్చే అతిథులు, విద్యార్థులు, ప్రజల సీటింగ్ సామర్థ్యం, సౌండ్ సిస్టమ్ తదితర ఏర్పాట్లను ఉన్నతస్థాయి అధికారులతో కలిసి ఆయన సమీక్షించారు. కార్యక్రమ నిర్వహణలో ఎక్కడా ప్రోటోకాల్‌కు ఇబ్బంది కలగకుండా అధికారు లు నిబద్ధతతో వ్యవహరించాలని ఆయన సూచించారు. అదేవిధంగా స్టేజీ ఏర్పాటుతో పాటు సుందరీకరణ పనులను వేగవంతంగా చేపట్టాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నందున ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రతి వాహనంలో వచ్చే పిల్లలకు ఒక లైజనింగ్ అధికారి తప్పనిసరిగా ఉండేలా చూడాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పంద్రాగస్టు రోజున గౌరవ ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు కార్యక్రమానికి హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లు ఘనంగా ఉండాలని, ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లను పక్కాగా, వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రికి సమర్పించే పోలీసుల గౌరవ వందనం, పోలీస్ కవాతును ఆయన ఉన్నతాధికారులతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, సమాచార శాఖ కమిషనర్ జి. ముకుంద రెడ్డి, అడిషనల్ డీజీపీ సంజయ్ కుమార్ జైన్, స్వాతి లక్రా, సీపీ సజ్జనార్, అడిషనల్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్, ఇంటెలిజెన్స్ ఓఎస్డీ కమలాసన్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ జితేందర్ రెడ్డి, సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ డి.ఎస్. జగన్, చీఫ్ ఇంజనీర్ రాధా కిషన్, రీజినల్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ జయ రామ మూర్తి, ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ రాజేశ్వర్ రెడ్డి, డి(స్టిక్ట్ ఆఫీసర్ వెంకన్న, ఆర్డీవో రామకృష్ణ, డీఈఓ యాద య్య, ఆర్ అండ్ బి, విద్యుత్, వైద్య, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మైనార్టీ రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే

(మొదటి పేజీ తరువాయి)

మైనారిటీల ప్రతిభా సదస్సుకు సీఎం రేవంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన పలువురు మైనారిటీలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మైనారిటీ రిజర్వేషన్లకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యతిరేకమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ నేతృత్వంలోనే మైనారిటీలకు సంక్షేమం అందుతోందని చెప్పారు. కాంగ్రెస్ అంటేనే సెక్యులర్ పార్టీ అని, హిందూ, ముస్లింలను రెండుకళ్లలా చూస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపైనా ముఖ్యమంత్రి విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం గ్రూప్-1 పరీక్షలను నిర్వహించలేకపోయిందని ఎద్దేవా చేశారు. ఓ ఆర్ఎంపీ డాక్టర్‌ను టీజీపీఎస్సీ సభ్యుడిగా నియమించారని సీఎం ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఉన్నంతకాలం దేశంలో సెక్యులర్ వర్గాలకు మనుగడ ఉంటుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హిందూ, ముస్లింలను రెండు కళ్లలా కాంగ్రెస్ చూస్తోందని చెప్పారు. నగరంలోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో మైనారిటీస్ ఎక్స్‌లెన్స్ సమ్మిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ ఇచ్చింది. వాటిని రద్దు చేయాలని కొందరు హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గుజరాత్‌లో మైనార్టీ రిజర్వేషన్లు రద్దు చేసి చూపాలని సవాల్ విసిరాం. లౌకిక వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పోరాడుతుంది. బాక్సింగ్ క్రీడాకారిణి నిఖత్ జరీన్‌కు గ్రూప్-1 ఉద్యోగం, రూ.3కోట్ల ప్రోత్సాహకం ఇచ్చాం. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్-1 నియామకాల ఊసే లేదు. ఒకసారి నియామకాలు చేపట్టినా పల్లీ, బఠానీల్లా ప్రశ్నపత్రాలు అమ్మారు. మా ప్రభుత్వం వచ్చాక టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశాం. అందులో విద్యావంతులను నియమించాం. టీజీపీఎస్సీ ద్వారా గ్రూప్-1 పోస్టులు భర్తీ చేశాం. గ్రూప్-1 రద్దు చేయాలని బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. అక్కడ మంచి న్యాయవాదిని పెట్టి వాదనలు వినిపించాం. తద్వారా నియామకాలు పూర్తిచేశాం. గ్రూప్ 2, 3, 4 పోస్టుల విషయంలోనూ కోర్టుల్లో పోరాడి ఉద్యోగాలు భర్తీ చేశాం‘అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. యూపీఎస్సీ తరహాలో టీజీపీఎస్సీని బలోపేతం చేశామని ధీమా వ్యక్తం చేశారు. రిటైర్డ్ డీజీపీని టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా నియమించామని చెప్పుకొచ్చారు. ఎంతో పారదర్శకంగా గ్రూప్-1 పరీక్షలు నిర్వహించామని తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నిఖత్ జరీన్ కోసం నిబంధనలు పక్కనపెట్టి మరీ గ్రూప్-1 ఉద్యోగం ఇచ్చామని, అలాగే క్రికెటర్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం కల్పించామని సీఎం రేవంత్ గుర్తు చేశారు. మైనారిటీ యువత చదువుతో పాటు నైపుణ్యం సంపాదించాలని కోరారు. జర్మనీ, జపాన్ లాంటి దేశాల్లో ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు స్కిల్స్ యూనివర్సిటీ కూడా ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు.

# పిల్లల ఆరోగ్యంపై ఆటలొద్దు

(మొదటి పేజీ తరువాయి)

పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. ఈ విషయంలో ఆహార పరిశ్రమ అభ్యంతరాలను మాత్రమే ఎఫ్ఎస్ఎస్ఏఐ పరిగణనలోకి తీసుకుందన్నారు. హార ప్యాకెట్లపై హెచ్చరిక గుర్తులకు బదులుగా అదనపు చక్కెర, సంతృప్త కొవ్వులు, ఉప్పు మొదలైన వాటిని రోజుకు ఎంతో తీసుకోవచ్చో పట్టిక రూపంలో చూపించే విధానాన్ని ఎఫ్ఎస్ఎస్ఏఐ సూచించింది. అయితే ఈ విధానం వినియోగదారులకు అవసరమైనంత అవగాహన అందించదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకున్న చర్యలపై సుప్రీంకోర్టు ప్రశ్నలు సంధించింది. గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదని, ఇప్పటివరకు ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుందని ధర్మాసనం ప్రశ్నించింది. హెచ్చరిక లేబుల్స్ వల్ల ఉత్పత్తుల విక్రయాలపై ప్రభావం పడుతుందని తయారీదారులు అభ్యంతరం వ్యక్తం చేయవచ్చని కోర్టు పేర్కొంది. అయితే తాము తినే ఆహారంలో ఎంత చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వు ఉందో తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉందని స్పష్టం చేసింది. హెచ్చరిక ఉన్నప్పటికీ ఉత్పత్తిని కొనాలా, వద్దా అనే తుది నిర్ణయం వినియోగదారుడిదేనని తెలిపింది. హెచ్చరిక లేబుల్స్‌కు సంబంధించిన ప్రతిపాదనపై చర్యలు తీసుకునేందుకు కేంద్రానికి సుప్రీంకోర్టు రెండు వారాల గడువు ఇచ్చింది. తదుపరి విచారణ సమయంలో అవసరమైతే తుది ఆదేశాలు జారీ చేస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.

# ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

**న్యూఢిల్లీ,ఆగస్టు 13:**పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిశాయి. గురువారం ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. లోక్‌సభ ప్రారంభమైన తర్వాత సభ్యులంతా కలిసి వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఈ సమావేశానికి ప్రధాని మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్‌తోపాటు సభ్యులంతా హాజరయ్యారు. జాతీయ గేయంలోని ఆరు చరణాలను పూర్తిగా ఆలపించిన అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేశారు. దీంతో వర్షాకాల సమావేశాలు ముగిసినట్లు అయింది. వందేమాతరం గేయాన్ని చట్టపరంగా రక్షణ కల్పించే శాసనానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేసిన కొన్ని రోజులకే లోక్‌సభలో ఈ పరిణామం చోటు చేసుకుంది. జాతీయ గేయాన్ని ఆలపించడాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం లేదా నిరోధించడం శిక్షార్హమైన నేరమని ఈ చట్టం స్పష్టం చేస్తోంది. తద్వారా దీనికి జాతీయ గీతం 'జనగణమన'తో సమానమైన చట్టపరమైన హోదా లభించినట్లైంది. రాష్ట్రపతి రాక, త్రివర్ణ పతాకావిష్కరణ, గవర్నర్ల ప్రసంగం వంటి సందర్భాల్లో వందేమాతరంలోని ఆరు చరణాలను ఆలపించాలని జనవరి 28వ తేదీన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 20వ తేదీన ప్రారంభమై.. ఆగస్టు 13వ తేదీతో ముగిశాయి. నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్రం విద్య శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతోపాటు విద్యావ్యవస్థలో సంస్కరణలను డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆందోళన చేపట్టింది. జులై 20వ తేదీన వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో ఆ రోజు చలో పార్లమెంట్ యాత్రకు సీజేపీ పిలుపునిచ్చింది. ఈ ఘటనతో చోటు చేసుకున్న తీవ్ర పరిణామాలతో మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. అదే విధంగా పార్లమెంట్ సమావేశాల్లో యాంటీ పేపర్ లీక్ బిల్లుతోపాటు పలు బిల్లులు ఆమోదం పొందాయి. అయితే.. ఢిల్లీలో యువతపై జరిగిన లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశాలు ఇచ్చారో సభలో ప్రకటన చేయాలంటూ కేంద్రాన్ని ప్రతిపక్షం కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో సభలో దాదాపుగా వాయిదాల పర్వం కొనసాగింది. చివరకు ఈ రోజు ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి.

# త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు

**న్యూఢిల్లీ,ఆగస్టు 13 :** దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. దీనివల్ల విద్యుత్ ఉత్పత్తి వ్యయం తగ్గి వినియోగదారులకు తక్కువ ధరకు విద్యుత్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2018 నుంచి బొగ్గు ధరలను పెంచలేదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అదే విధంగా సిమెంట్, స్టీల్ వంటి రంగాలకు సంబంధించిన ధరల విషయంలోనూ పెరుగుదలను నియంత్రించే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మినరల్స్ అంశంలో రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం చేయబోదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. పన్నులు, సెస్‌ల విషయంలోనూ కేంద్రం జోక్యం చేసుకోదని తెలిపారు. రాష్ట్రాలకు ఉన్న హక్కులు, అధికారాలను గౌరవిస్తూనే ఖనిజ రంగ అభివృద్ధికి కేంద్రం సహకరిస్తుందని చెప్పారు. దేశంలో మినరల్స్ ఉత్పత్తిని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని కిషన్‌రెడ్డి తెలిపారు.

# అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఖేలో ఇండియా క్రీడల నిర్వహణ

**న్యూఢిల్లీ,ఆగస్టు 13 :** కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి శ్రీ మన్‌సుఖ్ మాండవీయను తెలంగాణ క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి గురువారం న్యూఢిల్లీలో కలిశారు. ఆయనతోపాటు తెలంగాణ ప్రభుత్వ క్రీడా వ్యవహారాల సలహాదారు శ్రీ ఏపీ జితేందర్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శ్రీ కె. శివసేన రెడ్డి ఉన్నారు. తెలంగాణకు ఖేలో ఇండియా క్రీడలను కేటాయించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి వాకిటి శ్రీహరి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాసిన ఆహ్వాన లేఖను కేంద్ర మంత్రి మాండవీయకు అందజేశారు. డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు 12 రోజులపాటు తెలంగాణలో ఖేలో ఇండియా క్రీడలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఖేలో ఇండియా క్రీడలను ఘనంగా, విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసిందని మంత్రి పేర్కొన్నారు. నిర్వహణలో ఎలాంటి లోపాలు, విమర్శలకు తావులేకుండా అత్యున్నత ప్రమాణాలతో పోటీలను నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమయం తీసుకుని, ఖేలో ఇండియా క్రీడల ప్రారంభోత్సవానికి హాజరుకావాల్సిందిగా ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి స్వయంగా ఆహ్వానిస్తారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం నూతన క్రీడా విధానాన్ని తీసుకొచ్చి, విప్లవాత్మక నిర్ణయాలతో రాష్ట్రంలో క్రీడారంగాన్ని ముందుకు తీసుకెళ్తోందని మంత్రి వాకిటి శ్రీహరి చెప్పారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రాధాన్యం కల్పిస్తున్నామని తెలిపారు. అందరి సహకారంతో ఖేలో ఇండియా క్రీడలను విజయవంతంగా నిర్వహించి తెలంగాణ ప్రతిష్ఠను మరింత పెంచుతామని పేర్కొన్నారు.ద

# బిసి మహిళలకు స్వయం ఉపాధి

(మొదటి పేజీ తరువాయి)

100 శాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టుమిషన్లు అందిస్తామని.. వారిని కేవలం లబ్ధిదారులుగా కాకుండా స్వయం ఉపాధి పొందే మహిళా పారిశ్రామిక వేత్తలుగా తీర్చదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1,19,000 కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఒక్కో దాని విలువ రూ.12,000 కాగా, లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా 100 శాతం సబ్సిడీపై అందజేస్తామని చెప్పారు. ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు అర్హులైన బీసీ మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
శుక్రవారం, ఆగస్టు 14, 2026



## ఘనంగా హర్ ఘర్ తిరంగా యాత్ర నిర్వహణ



**మానకొండూర్, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** మానకొండూర్ మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గురువారం తిరంగా యాత్ర ఘనంగా నిర్వహించారు. వేద స్కూల్ నుంచి ప్రారంభమైన యాత్ర ఎస్సీ కాలనీ మీదుగా పల్లె చౌరస్తా వరకు కొనసాగి, అక్కడ జాతీయ గీతం ఆలాపనతో ముగిసింది. విద్యార్థులు, కార్యకర్తలు జాతీయ జెండాలతో పాల్గొని దేశభక్తిని చాటుకున్నారు. చాణక్య స్కూల్, గుడ్ న్యూస్ స్కూల్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి సహకరించిన పాఠశాల యాజమాన్యాలు, ఉపాధ్యాయులకు బీజేపీ మండల శాఖ ధన్యవాదాలు తెలిపింది. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కంది రాజిరెడ్డి, ఉపాధ్యక్షులు గుర్రాల వెంకట్ రెడ్డి, రాష్ట్ర నాయకులు అప్పని తిరుపతి, సీనియర్ నాయకులు దూలం కిరణ్, శంకరచారి, సోన్నకుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులు బాషబోయిన ప్రదీప్ యాదవ్, శీలం కుమార్, నాయకులు మార్కొండ రమేష్ పటేల్, పూసల సాయి, పోచంపల్లి శ్రీనివాస్, కార్యదర్శులు మార్క సుమతి, కొల శ్రీనివాస్, గాడిచర్ల భూమయ్య, కిసాన్ మోర్చా అధ్యక్షుడు అడప రవి, దళిత మోర్చా అధ్యక్షుడు కొండ్ర సురేష్, మహిళా మోర్చా అధ్యక్షురాలు అవుదారి విజయ, యువ మోర్చా అధ్యక్షుడు కొండ్ర వరప్రసాద్, నాయకులు రాజుగోపాల్ రెడ్డి, ఆరెపల్లి సునంద్, బూత్ అధ్యక్షులు దొంగల శ్రీధర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## పురపాలక సంఘం ఆధ్వర్యంలో సఫాయి అప్నా బిమారి భగావో కార్యక్రమం నిర్వహణ



**హుస్నాబాద్, ఆగస్టు 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** హుస్నాబాద్ పట్టణంలోని 13వ వార్డులో పురపాలక సంఘం ఆధ్వర్యంలో సఫాయి అప్నా బిమారి భగావో కార్యక్రమం నిర్వహించారు. చైర్‌పర్సన్ దండి లక్ష్మి, కౌన్సిలర్లు ఇంటింటికీ తిరిగి ప్రజలకు వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. నిల్వ నీటిని తొలగించడం, పాత టైర్లు, కుండలు, రంజాన్లలో నీరు నిల్వ లేకుండా చూడడం, చేతులు పరిశుభ్రంగా కడుక్కోవడం వంటి చర్యలతో డయేరియా, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులను నివారించవచ్చని సూచించారు. రైన్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్స్ ఏర్పాటు చేసుకోవాలని, చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు బురుగు లత, కొండ రజిత, పిల్లి తిరుపతి, సావుల మంజుల, వరప్రసాద్, కేశవేని రమేష్, బొల్లి శ్రీనివాస్, వైద్యం కిరణ్ ప్రసాద్, గాదెపాక రవీందర్, బత్తుల స్వరూప, కో ఆప్షన్ సభ్యులు హసన్, ప్రజా ప్రతినిధులు, సానిటరీ ఇన్స్పెక్టర్ బాల ఎల్లం, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ రవి కుమార్, జవాన్ ప్రభాకర్, శ్రీకాంత్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న మేయర్



**కరీంనగర్, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ బీజేపీ నార్త్ జోన్ ఆధ్వర్యంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రజల్లో దేశభక్తి భావనను బలోపేతం చేయడం, ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగురవేయాలనే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపును ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో ఈ ర్యాలీ నిర్వహించబడింది. ఎస్ఆర్ఆర్ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ కోర్టు సర్కిల్‌లోని అంబేద్కర్ చౌక్ వరకు కొనసాగింది. పెద్ద సంఖ్యలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువత, విద్యార్థులు జాతీయ జెండాలను చేతబట్టి దేశభక్తి నినాదాలతో ముందుకు సాగారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి మేయర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా కార్యక్రమం దేశ ఐక్యత, సమగ్రతకు ప్రతీక అని, ప్రతి పౌరుడు జాతీయ పతాకాన్ని గౌరవంగా ఎగురవేసి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, కార్పొరేటర్ బండ రమణారెడ్డి, బీజేపీ నార్త్ జోన్ అధ్యక్షుడు పాదం శివరాజ్, నాయకులు భారీ జితేందర్, చిగిరి రవీందర్, మాడిశెట్టి సంతోష్, బోయిని శ్రీనివాస్, కైలాస నవీన్, గాండ్ల నరేష్, నక్క ప్రమోద్, వెంకటేష్, వినయ్, నికిల్, మహేష్, యువమోర్చా నాయకులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## "భారతమాతకు జై", "వందేమాతరం" నినాదాలతో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



**జగిత్యాల, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జగిత్యాల జిల్లా కేంద్రంలో గురువారం ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. టౌన్ హాల్ నుండి తహసీల్ చౌరస్తా వరకు సాగిన ఈ ర్యాలీలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డా. బోగ శ్రావణి పాల్గొన్నారు. జాతీయ జెండాలను చేతబట్టి "భారతమాతకు జై", "వందేమాతరం" నినాదాలతో పట్టణం మార్మోగింది. నాయకులు మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తి భావాన్ని చాటాలని, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హర్ ఘర్ తిరంగా జిల్లా కన్వీనర్లు, రాష్ట్ర, జిల్లా, మండల పదాధికారులు, కార్యకర్తలు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జాతీయ ఐక్యతను చాటడానికి ప్రతి ఏటా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహణ



**కరీంనగర్ రూరల్, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కొత్తపల్లి రూరల్ బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ గురువారం ఘనంగా నిర్వహించారు. వేద స్కూల్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ఎస్సీ కాలనీ మీదుగా పల్లె చౌరస్తా వరకు కొనసాగి, జాతీయ గీతంతో ముగిసింది. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకుడు కన్నబోయిన ఓదెలు మాట్లాడుతూ దేశభక్తి భావనను పెంపొందించడానికి, జాతీయ ఐక్యతను చాటడానికి ప్రతి ఏటా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన అమరులను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. త్రివర్ణ పతాకం జాతీయ గౌరవానికి, సార్వభౌమత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. విద్యార్థులు, కార్యకర్తలు, యువకులు జాతీయ జెండాలను చేతబూని ఉత్సాహంగా పాల్గొని "భారత్ మాతా కీ జై" నినాదాలతో మార్మోగించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కుంట తిరుపతి, సర్పంచులు నునుగొండ మానస ప్రవీణ్, కోమటిరెడ్డి అంజనీ కుమార్, ఉప సర్పంచులు కట్ల వెంకటేష్, అరె నరేష్ గౌడ్, వార్డ్ సభ్యులు జవ్వాజి రమేష్, కడార్ల రతన్, వేముల అనిల్ కుమార్, సోమినేని కర్ణాకర్, నలువాల మహేష్, నేరెళ్ల గంగారం, జిందం సుకుమార్, ఇల్లెందుల ఆనంద్, గోడిసెల రంజిత్ గౌడ్, మెరుగు మల్లేశం, రాచకొండ అనిల్‌తో పాటు వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విజయవంతంగా హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీ



**శంకరపట్నం, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గురువారం శంకరపట్నం మండలంలో నిర్వహించిన తిరంగా బైక్ ర్యాలీ ఘన విజయాన్ని సాధించింది. బీజేపీ మండల అధ్యక్షుడు ఎనుగుల అనిల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీకి ప్రజలు, యువత, కార్యకర్తలు భారీ సంఖ్యలో బైక్‌లతో తరలివచ్చారు. తాడికల్ నుంచి కేశవపట్నం వరకు సాగిన ర్యాలీలో ప్రతి బైక్‌పై జాతీయ జెండా ఎగురవేసి "భారత్ మాతాకీ జై", "వందే మాతరం" నినాదాలతో దేశభక్తిని చాటారు. మార్గమధ్యంలో ప్రజలు ర్యాలీకి స్వాగతం పలకగా, కేశవపట్నం పరిసరాలు త్రివర్ణ పతాకాలతో మార్మోగాయి. ఎనుగుల అనిల్ మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా కార్యక్రమానికి ప్రజల నుంచి లభించిన స్పందన ఉత్సాహాన్నిచ్చిందని, దేశభక్తి భావనను ప్రతి ఇంటికి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్ర మంలో జిల్లా అధికారి అలివేలు సమ్మిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దండు కొమురయ్య, మాజీ ఎంపీపీ దొంగల రాములు, వంకాయగూడెం సర్పంచ్ వెన్నం మల్లేశం, బీజేపీ నాయకులు దాసరపు నరేందర్, నిమ్మశెట్టి సంపత్, మందాడి జగ్గారెడ్డి, జానపట్ల రాజిరెడ్డి, కనకం సాగర్, రాసమల్ల శ్రీనివాస్, రాజేందర్, సారయ్య, ఐలయ్య, గౌరవేణి శ్రీనివాస్, పెసరి వీరా అర్జున్, పల్లె శివారెడ్డి, బోడ తిరుపతిరెడ్డి, చర్ల శ్రీనివాస్, మహిళా మోర్చా అధ్యక్షురాలు చర్ల అనిత, యువ మోర్చా అధ్యక్షుడు బొజ్జ సాయి ప్రకాష్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు లోకిని కుమార్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కనకం కుమారస్వామి, వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



**కరీంనగర్, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 23వ డివిజన్ సీతారాంపూర్ ప్రాంతంలో సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని ప్రతి డివిజన్‌లో అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజలకు మెరుగైన రహదారులు, పారిశుధ్య సదుపాయాలు, తాగునీటి సౌకర్యాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. సీతారాంపూర్ ప్రాంతంలో సీసీ రోడ్డు పనులు పూర్తయిన తర్వాత స్థానిక ప్రజలకు రాకపోకల ఇబ్బందులు తొలగి మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. అనంతరం 17, 18వ డివిజన్లలో అమృత్ 2.0 నిధులతో చేపట్టనున్న బ్లాక్ ప్లాంటేషన్ ఫెన్సింగ్ పనులను మేయర్ ప్రారంభించారు. నగరంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడేలా ఈ పనులు భవిష్యత్ తరాలకు ఉపయోగపడతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో 23వ డివిజన్ కార్పొరేటర్ గుమ్మడి రాజకుమార్, 17వ డివిజన్ కార్పొరేటర్ వేముల కవిత చంద్రశేఖర్, 18వ డివిజన్ కార్పొరేటర్ వాసాల రమేష్, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, డివిజన్ వాసులు పాల్గొన్నారు.

# స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్



**కరీంనగర్, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు ఎస్ఎఫ్ఐ నాయకులను అరెస్టు చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. రజనీకాంత్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని, వేల కోట్ల రూపాయల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని విమర్శించారు. విద్యాశాఖకు మంత్రి లేకపోవడం వల్ల సమస్యలు మరింత తీవ్రతరం అవుతున్నాయని, తక్షణమే ప్రత్యేక మంత్రిని కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో యూనిఫాంలు, మౌలిక వసతులు లేకపోవడం, మధ్యాహ్న భోజనం, ఉదయం టిఫిన్ పథకాలు అమలు చేయకపోవడం దారుణమని ఆయన పేర్కొన్నారు. జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని, సైన్స్ కళాశాలకు కొత్త భవనం నిర్మించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఎస్ఎఫ్ఐ హెచ్చరించింది. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కంపెల్లి అరవింద్, గర్ల్స్ కన్వీనర్ మానస, రాష్ట్ర కమిటీ సభ్యులు సంజన, ఇతర నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మద్దెల వాగు హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం

**సుల్తానాబాద్/కాల్వ శ్రీరాంపూర్, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కాల్వ శ్రీరాంపూర్ మండలం జఫర్‌ఖాన్‌పేట గ్రామంలో రూ. 5.43 కోట్ల వ్యయంతో నిర్మించిన మద్దెల వాగు హై లెవెల్ బ్రిడ్జిని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ప్రారంభించారు. అనంతరం గోదావరిఖని--జఫర్‌ఖాన్‌పేట--పెద్దపల్లి ఆర్టీసీ బస్సు సర్వీసును జెండా ఊపి ప్రారంభించారు. గ్రామంలో రూ. 15 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను కూడా ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో రోడ్లు, పాఠశాల భవనాల కొరతతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇప్పుడు అన్ని వీధుల్లో సీసీ రోడ్లు పూర్తి చేశామని తెలిపారు. మద్దెల వాగు బ్రిడ్జి నిర్మాణానికి రూ. 5.43 కోట్లు, అప్రోచ్ రోడ్లకు అదనంగా రూ. 1 కోటి ఖర్చు చేశామని, అలాగే మంగపేట--ముత్తారం డబుల్ రోడ్డుకు రూ. 32 కోట్లు, పెద్దపల్లి--గర్రెపల్లి రోడ్డుకు రూ. 100 కోట్లు, సుల్తానాబాద్--పెద్దపూర్ రోడ్డుకు రూ. 47 కోట్లు, ఇతర రోడ్లకు కూడా నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. ఆగస్టు 17న సుల్తానాబాద్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరగనున్నట్లు తెలిపారు. ఇటీవలి వర్షాలతో చెరువులు నిండుతున్నాయని, రైతుల్లో ఆనందం నెలకొన్నదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణానికి త్వరలో శ్రీకారం చుడతామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు గజ్జనవేణ సదయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.





# ప్రభుత్వ పాఠశాలల్లో శుభ్రతపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి



**కరీంనగర్, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్నారు.ధన్గర్ వాడీ ప్రాథమిక పాఠశాల, భవిత కేంద్రం, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ పిల్లలకు అందిస్తున్న సౌకర్యాలు, ఆహారం, సిబ్బంది వివరాలు పరిశీలించారు. జిల్లాలోని 16 భవిత కేంద్రాల్లో తాగునీటి డిస్పెన్సరీలు ఏర్పాటు చేయాలని, ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులకు యూనిఫాంలు, పుస్తకాలు అందించాలని ఆదేశించారు.పాఠశాలల్లో వృధాగా ఉన్న ఫర్నిచర్, బెంచీలను అవసరమైన చోటుకు తరలించాలని, స్క్రాప్ తొలగించి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. పిల్లలు కింద కూర్చోకుండా బెంచీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.తరువాత అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌ను సందర్శించిన కలెక్టర్ భవనం శిథిలావస్థలో ఉందని, మరమ్మత్తులు చేపట్టాలని, అప్పటివరకు తాత్కాలికంగా ముకరంపురలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌కు తరలించాలని సూచించారు. హై స్కూల్ తరగతి గదులను తొలగించి కొత్త భవనం నిర్మించాలని, ప్రహరీ, అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.స్మార్ట్ సిటీ కింద పాఠశాలల్లో ఖర్చు చేసిన నిధులపై పూర్తి నివేదిక ఇవ్వాలని అధికారులను కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు.

# బీసీ మహిళలకు ఉచిత ఆటోమేటిక్ కుట్టు మిషన్ల పంపిణీ



**హుస్నాబాద్, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో పేద, మధ్యతరగతి బీసీ మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఉచిత ఆటోమేటిక్ కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది.రాష్ట్ర బీసీ మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ముఖ్య సలహాదారు వి. హన్మంతరావు, పలువురు ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ ఛైర్మన్‌లతో కలిసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి నియోజకవర్గానికి 1000 ఆటోమేటిక్ కుట్టు మిషన్లు అర్హులైన మహిళలకు ఉచితంగా అందించనున్నారు.ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు మీ-సేవ/ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. జీవో నంబర్ 2 ప్రకారం కుట్టు వృత్తిని ప్రధాన వృత్తిగా కొనసాగిస్తున్న మేర కులస్తుల మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నారు.మేర కార్పొరేషన్, రాష్ట్ర మేర సంఘం తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అర్హులైన మేర మహిళలు రేషన్ కార్డు, ఆదాయ ధృవీకరణ, నివాస ధృవీకరణ, ఆధార్ వంటి పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.
డా. అక్కు శ్రీనివాస్ మేరు మాట్లాడుతూ, ఈ పథకం మేర కులస్తుల మహిళలకు ఎంతో ప్రయోజనం కలిగిస్తుందని, అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా విద్యాబోధన చేపట్టాలి

## - కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ముక్రాంపుర ఓల్డ్ హైస్కూల్ క్యాంపస్‌లోని ఇంటిగ్రేటెడ్ బాలుర హాస్టల్‌ను పరిశీలించారు. అంతకుముందు డాక్టర్ స్ట్రీట్‌లోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌ను సందర్శించి లీకేజీలు, కిచెన్ షెడ్డు, తాగునీరు, టాయిలెట్లు వంటి సమస్యలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మరమ్మతులు పూర్తయ్యే వరకు విద్యార్థులను ముక్రాంపుర హాస్టల్‌కు తరలించి అక్కడే వసతి, భోజనం, తరగతుల నిర్వహణ కొనసాగించాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో పనులు పూర్తయిన వెంటనే విద్యార్థులను తిరిగి అక్కడికి తరలించాలని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థుల విద్యకు అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాశాఖ కోఆర్డినేటర్లు అశోక్‌రెడ్డి, మిల్కూరి శ్రీనివాస్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ కార్యకర్తల అరెస్టులను ఖండించిన మాజీ ఎమ్మెల్యే



**కాల్వ శ్రీరాంపూర్, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** బిఆర్ఎస్ కార్యకర్తలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం తీవ్రంగా ఖండించిన మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, బాధ్యత గల పోలీసులు వాస్తవ పరిస్థితులను పరిశీలించి నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అన్నారు.కాల్వ శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌కు బయలుదేరిన ఆయనను మార్గమధ్యంలోనే పోలీసులు అడ్డుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో తాను శంకుస్థాపన చేసిన శిలాఫలకాన్ని కాంగ్రెస్ నాయకులు ధ్వంసం చేసి కొత్త శిలాఫలకం ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు.ఈ విషయాన్ని పరిశీలించేందుకు వెళ్లిన బిఆర్ఎస్ కార్యకర్తలను అరెస్టు చేయడం సరికాదని పేర్కొన్నారు. కార్యకర్తలపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించి, అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. “బిఆర్ఎస్ కార్యకర్తలకు ఎటువంటి అన్యాయం జరిగినా పార్టీ అండగా ఉంటుంది. ప్రతి కార్యకర్తకు నేను అండగా నిలుస్తాను” అని స్పష్టం చేశారు.కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సంపత్ యాదవ్, జూపల్లి సందీప్ రావు, బోయిని రాజమల్లు, దొమ్మడి శ్రీనివాస్, జూకంటి అనిల్, సలేంద్ర రాములు, చంద్ర మొగిలి, ఓదెల మండలం యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్, నవీన్ యాదవ్, కుంభం రాజు, రఫీక్, పాల అంజన్న, అజయ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# నిడమానూరులో కరెంటు కోతలపై రైతుల ధర్నా




**నిడమానూరు, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని కరెంటు కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పంట పొలాలు ఎండిపోకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం నిడమానూరు మండలంలోని వేంపాడు సబ్‌స్టేషన్ ముందు రైతులు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొండేటి శ్రీను, మండల కార్యదర్శి కందుకూరి కోటేష్ మాట్లాడుతూ, “రైతులు ఎంతో కష్టపడి బోరు బావుల కింద సాగు చేస్తుంటే కరెంటు కోతల వల్ల పొలాలు ఎండిపోతున్నాయి. లైన్మెన్లు అందుబాటులో లేకపోవడం, ట్రాన్స్ఫార్మర్లపై అధిక లోడ్ కారణంగా మోటార్లు కాలిపోతున్నాయి. సబ్‌స్టేషన్ సిబ్బంది నిర్లక్ష్యం రైతులను మరింత ఇబ్బందులకు గురి చేస్తోంది” అని ఆవేదన వ్యక్తం చేశారు.రాత్రి సమయంలో ఫ్యూజులు మార్చుకోవాల్సిన పరిస్థితి రైతులపై పడుతోందని, ప్రభుత్వం ప్రకటించిన విధంగా నిరంతరాయంగా వ్యవసాయానికి కరెంటు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. “రైతుల పట్ల నిర్లక్ష్యం కొనసాగితే ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేస్తాం. అవసరమైతే పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తాం” అని హెచ్చరించారు.ఈ ధర్నాలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కోమండ్ల గురువయ్య, వెంపటి మహేష్, మలికంటి చంద్రశేఖర్, రైతు సంఘం మండల అధ్యక్షుడు నడ్డి నాగరాజు, కోదండ చరణ్ రాజు, రైతులు నారబోయిన శంకర్, వెంపటి హనుమంతు, రాగం రామలింగయ్య, వెంటపడి సందీప్, పోలగోని నరసింహ, చిలుక అశోక్ రెడ్డి, కాంసాని దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

# నాగర్‌కర్నూల్‌లో ఘనంగా తిరంగా ర్యాలీ



**నాగర్‌కర్నూల్, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ ఘనంగా జరిగింది.బీజేపీ టౌన్ అధ్యక్షుడు చవ్వ ప్రమోద్‌కుమార్ ఆధ్వర్యంలో మార్కెట్ యార్డ్ శివాలయం నుండి నాగర్‌కర్నూల్ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది. పాఠశాల, కళాశాల విద్యార్థులు, ఆటో స్టాండ్ యూనియన్, కార్మికులు, వివిధ సంఘాలు, ఎబివిపి నాయకులు పాల్గొని చేతుల్లో మువ్వన్నెల జెండాలను పట్టుకుని దేశభక్తి నినాదాలతో కదంతొక్కారు.ఈ ర్యాలీకి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి భరత్ ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు వేముల నరేందర్‌రావు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ, “మువ్వన్నెల జెండా మన దేశ గౌరవానికి, స్వాతంత్ర్యానికి, ఐక్యతకు ప్రతీక. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి భావాన్ని చాటాలి” అని పిలుపునిచ్చారు.బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ధన్నోజు నరేష్ చారి మాట్లాడుతూ, యువత దేశ ప్రయోజనాల కోసం ముందుండాలని, నేటి విద్యార్థులే రేపటి పౌరులు, రేపటి భారతదేశాన్ని నిర్మించే శక్తిగా ఎదగాలని సూచించారు.భరత్ ప్రసాద్ మాట్లాడుతూ, యువత, విద్యార్థులు దేశ చరిత్ర, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, రాజ్యాంగ విలువలను తెలుసుకుని జాతీయతా భావంతో ముందుకు సాగాలని సూచించారు. “దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలి” అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పంజుగుల నాగేందర్ గౌడ్, మాజీ జిల్లా అధ్యక్షులు బుసిరెడ్డి సుబ్బారెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పద్మ యాదవ్, ఓబీసీ మోర్చా జెట్టి వెంకటేష్, జిల్లా కార్యదర్శి చంద్రకళ, మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు జానకి, మాజీ జిల్లా ఉపాధ్యక్షులు పోల్దాస్ రాము, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ రెడ్డి, యువ మోర్చా రాష్ట్ర నాయకులు విజేందర్ రెడ్డి, ప్రవీణ్, వెంకటేష్, సత్యనారాయణ, ఎబివిపి నాయకులు శాంతన, శివ, వెంకటేష్తో పాటు కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# కాలేజీల్లో ఫైర్ నిబంధనలు ఉల్లంఘనపై ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ఆగ్రహం




**కరీంనగర్, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీల్లో ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించకుండానే ఎన్‌ఓసీలు జారీ చేస్తున్నారని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ తీవ్రస్థాయిలో విమర్శించారు.కరీంనగర్ డీఐఈఓ కార్యాలయం అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని, ఫైర్ అధికారులు, విద్యాశాఖ అధికారులు ముడుపులు తీసుకుని నామ మాత్రపు తనిఖీలతో కాలేజీలకు సర్టిఫికెట్లు ఇస్తు న్నారని ఆరోపించారు. కనీస వసతులు లేక న్నా, ల్యాబ్‌లు, లైబ్రరీలు తప్పుడు నివేదికలతో చూపిస్తూ క్లీన్ చిట్ ఇవ్వడం ఘోరమని అన్నారు.ఈ అక్రమాలపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి ఆధారాలతో ఫిర్యాదు చేయనున్నట్లు బండారి శేఖర్ తెలిపారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న అధికారులపై తక్షణమే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# గోశాలకు రూ.40 వేల పశుగ్రాసం చెక్కు అందజేత



**కరీంనగర్, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ గిరిజా గోశాల ట్రస్ట్ ఆధ్వర్యంలో మృత్యుంజయ మహాదేవాలయం గోశాలకు పశుసంవర్ధక శాఖ నుంచి రూ.40,000ల పశుగ్రాసం చెక్కు అందజేశారు.పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నల్ల లింగారెడ్డి చెక్కును గోశాల నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి, గోశాల నిర్వాహకులు చల్ల మోహన్ రెడ్డి, సంఘ్యం లక్ష్మణరావు, రాష్ట్ర అధ్యక్షుడు గూడ ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.గోశాల నిర్వాహకులు మాట్లాడుతూ నోరులేని మూగజీవాల సంరక్షణకు ఆర్థిక సహాయం అందించిన పశుసంవర్ధక శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. గోవులు పాలు, సేంద్రియ ఎరువుతో రైతులకు, సమాజానికి మేలు చేస్తున్నాయని, వాటి సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.మూగజీవాలకు ఆహారం, నీరు, వైద్యం, ఆశ్రయం అందించడం గొప్ప మానవతా సేవ అని, గోశాల నిర్వహణకు ప్రజలు, దాతలు ముందుకు వచ్చి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# సైబర్ సెక్యూరిటీ అవగాహన ర్యాలీ



**కరీంనగర్, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్)లో స్పార్క్ క్లబ్ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల నుంచి వేములవాడ రోడ్డువరకు సాగిన ఈ ర్యాలీలో విద్యార్థులు ప్రజలకు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారాన్ని సురక్షితంగా ఉంచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ రమేష్, ఎస్ఐ అనూష, సైబర్ క్రైమ్ సిబ్బంది పాల్గొని విద్యార్థులకు ఆన్‌లైన్ మోసాలు, ఫిషింగ్, ఓటీపీలు, వ్యక్తిగత వివరాలను అపరిచితులతో పంచుకోవద్దనే అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ మోసాలకు గురైనప్పుడు వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి నాయకత్వంలో జరిగిన ఈ ర్యాలీలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. “సైబర్ సురక్షిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి” అనే సందేశంతో ర్యాలీ విజయవంతంగా ముగిసింది.

# మహిళా డిగ్రీ కళాశాలలో లాంచ్ గర్ల్స్ ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహణ



**కరీంనగర్, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్)లో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో ప్రథమ సంవత్సరం విద్యార్థినుల కోసం “లాంచ్ గర్ల్స్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్” విజయవంతంగా నిర్వహించారు. కళాశాల కోఆర్డినేటర్ డా. బి. రాజనీ దేవి సమన్వయంతో జరిగిన ఈ కార్యక్రమంలో బీఏ, బీకాం, బీఎస్సీ లైఫ్ సైన్సెస్, బీఎస్సీ ఫిజికల్ సైన్సెస్ విభాగాల 735 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. లాంచ్ గర్ల్స్ అసోసియేట్ దివ్య పర్ణంది మూడు సంవత్సరాల ప్రోగ్రామ్‌లో కెరీర్ అవగాహన, నైపుణ్యాల అభివృద్ధి, మెంటార్‌షిప్, ఇంటర్న్‌షిప్‌లు, ఉద్యోగ అవకాశాలపై శిక్షణ అందిస్తామని వివరించారు.డా. రాజనీ దేవి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థినుల్లో జీవన నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెంది, ఉద్యోగానికి సిద్ధమైన సాధికారత పొందిన యువతులుగా ఎదగడానికి దోహదపడుతుందని తెలిపారు.కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి విద్యార్థినులు విద్యాపరమైన ప్రతిభతో పాటు వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా సాధికారత సెల్ సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# హమాలి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి - సీఐటీయూ



**హుజురాబాద్, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఆల్ హమాలి వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో హుజురాబాద్ తాసిల్దారు కార్యాలయం వద్ద హమాలి కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం వినతిపత్రాన్ని తాసిల్దారుకు అందజేశారు.సీఐటీయూ మండల కన్వీనర్ కదిరే రమేష్ మాట్లాడుతూ హమాలి కార్మికులు ఎన్నో సంవత్సరాలుగా కష్టపడి పనిచేస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి బెనిఫిట్స్ అందడం లేదని విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలో వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేస్తామని, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చి ఇప్పటివరకు అమలు చేయలేదని అన్నారు. హమాలి కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, హెల్త్ కార్డులు జారీ చేసి ఉచిత వైద్య సేవలు అందించాలని, 55 ఏళ్లు పూర్తయిన ప్రతి కార్మికుడికి నెలకు రూ.6000 పింఛన్ ఇవ్వాలని, ఇండ్లు లేని వారికి భూమి కొనుగోలు చేసి ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో మరణించిన కార్మికులకు రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాచపల్లి శంకర్, రాచపల్లి సారయ్య, మోరి మహేష్, కొడిమెల వెంకటేష్, ప్రభాకర్, శ్రవణ్ కుమార్, ప్రభు శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

RNI - TELTEL/2023/87644
నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
శుక్రవారం,
ఆగస్టు 14, 2026



# ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా శ్రావణమాస వనభోజనం



కరీంనగర్, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో జీవశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శ్రావణమాస వనభోజన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులు ప్రకృతిని ప్రేమి స్తూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు. జీవశాస్త్ర విభాగాధిపతి డా. ఎన్. మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, డిగ్రీ, పీజీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ప్రకృతి ఒడిలో నిర్వహించిన ఈ వనభోజనం విద్యార్థులకు ఆహ్లాదాన్ని కలిగించడంతో పాటు ఐక్యత, స్నేహ భావం, సహకారం, సామాజిక బాధ్యత వంటి విలువలను పెంపొందించేలా సాగిందని నిర్వాహకులు తెలిపారు.

## తొమ్మిది నెలలుగా రాజన్న దర్శనానికి దూరమైన భక్తులు



రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో అభివృద్ధి పనుల కారణంగా గత 9 నెలలుగా భక్తులకు దర్శనం నిలిపివేయడం వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు.శ్రావణమాసంలోనైనా భక్తులకు దర్శన భాగ్యం కల్పించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ గరీమ అగ్రవాల్‌కు వినతిపత్రం అందజేశారు. అభివృద్ధి పనులు కొనసాగుతున్నప్పటికీ భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసాలను గౌరవిస్తూ దర్శనానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శ్రావణమాసం పవిత్రమైన కాలమని, ఈ సమయంలో రాజన్న దర్శనం కోసం భక్తులు ఆతృతగా ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే దర్శన ఏర్పాట్లు చేయాలని బీజేపీ తరఫున కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి, జిల్లా కోశాధికారి ఆసాని రామలింగారెడ్డి, పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొన్న జె.ఎస్.ఆర్



హుస్నాబాద్, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : హుస్నాబాద్ పట్టణంలో బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి (జె.ఎస్.ఆర్) పాల్గొన్నారు.స్థానిక ప్రజలు, కార్యకర్తలతో కలిసి ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా జె.ఎస్.ఆర్ మాట్లాడుతూ త్రివర్ణ పతాకం భారతదేశ ఆత్మగౌరవానికి, సార్వభౌమాధికారానికి ప్రతీక అని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జెండాను ఎగురవేసి దేశభక్తిని, ఐక్యతను చాటాలని అన్నారు.ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు.కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో నాయకులు, యువకులు, మహిళలు, ప్రజలు పాల్గొని "భారత్ మాతాకీ జై", "వందేమాతరం" నినాదాలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

# నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకై విద్యుత్ లైన్లు ఏర్పాటు



కరీంనగర్, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు కరీంనగర్ సర్కిల్ పరిధిలో ఇప్పటివరకు 18 ఇంటర్‌లింక్ లైన్లు ఏర్పాటు చేశామని సూపరింటెండింగ్ ఇంజనీర్ ఆర్. రవీందర్ తెలిపారు.33కేవీ ఇంటర్‌లింక్ లైన్ వ్యవస్థ ద్వారా ఒక సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు మరో సబ్‌స్టేషన్ నుంచి ప్రత్యామ్నాయంగా విద్యుత్ అందించవచ్చని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాలు, నిర్వహణ పనులు, ఇతర కారణాల వల్ల సరఫరా అంతరాయం కలిగినప్పుడు ఈ వ్యవస్థ వినియోగదారులకు నిరంతర విద్యుత్ అందించడంలో ఉపయోగపడుతుందని వివరించారు.కరీంనగర్ సర్కిల్‌లోని 96 సబ్‌స్టేషన్లలో 66 లైన్లలో ఇంటర్‌లింకింగ్ వ్యవస్థ అమలు చేయగా, 11కేవీ లైన్లలో 467 ఇంటర్‌లింక్ లైన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు ఈ ప్రత్యామ్నాయ వ్యవస్థ ఎంతగానో దోహదపడుతుందని స్పష్టం చేశారు.

# విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించాలి టీజీపిజేఏసీ




కరీంనగర్, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లోని కోల్, యాష్ హ్యాండ్లింగ్ విభాగాలను ప్రైవేటుపరం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని టీజీపిజేఏసీ నాయకులు డిమాండ్ చేశారు.కరీంనగర్ సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం ఆవరణలో విద్యుత్ ఉద్యోగులు 30వ రోజు కూడా నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.నాయకులు మహేందర్ రావు, శ్రీనివాస్, రాజు, కిరణ్, సవాయి నాయక్, రంగు వెంకటనారాయణ, నిఖిల్ తదితరులు పాల్గొని, విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించే నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## దోమల నివారణకై మందు పిచికారి కార్యక్రమం నిర్వహణ



ఖానాపూర్, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ఖానాపూర్ పట్టణంలోని 7వ వార్డు పద్మావతి నగర్ కాలనీలో మున్సిపల్ కౌన్సిలర్ నిమ్మల రమేష్ ఆధ్వర్యంలో దోమల మందు పిచికారి కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ రమేష్ మాట్లాడుతూ వార్డు పరిధిలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జూని కుమార్, వకీల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

# షేక్ నజీర్ అహ్మద్ (వలి) ఆధ్వర్యంలో ఇంటింటికి టిడిపి కార్యక్రమం నిర్వహణ



గడివేముల, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : గడివేముల మండలంలోని బిలకల గూడూరు గ్రామంలో "రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమం కింద ఇంటింటికి తెలుగుదేశం నిర్వహించారు. నంద్యాల జిల్లా అధ్యక్షురాలు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి ఆదేశాల మేరకు మండల టిడిపి ప్రధాన కార్యదర్శి షేక్ నజీర్ అహ్మద్ (వలి) ఆధ్వర్యంలో బూత్ 326లో ప్రతి ఇంటిని సందర్శించి, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ప్రజలు ప్రభుత్వాన్ని ఆదరిస్తున్నారని, అభివృద్ధి కార్యక్రమాలతో సంతోషంగా ఉన్నారని షేక్ నజీర్ అహ్మద్ తెలిపారు. కార్యక్రమంలో షఫీ, షేక్ ము జ్బుల్, ఎస్.ఏ. ఫరూక్, చిన్న స్వామన్న, ఖ యీము, ఎస్. గఫారు తదితరులు పాల్గొన్నారు.

# శ్రావణ మాస బోనాల మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



మిర్యాలగూడ, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):మిర్యాలగూడ మండలంలోని తకెళ్లపాడు గ్రామంలో శ్రావణ మాస బోనాల మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ వేడుకలో మిర్యాలగూడ శాసన సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. గ్రామ ప్రజలు, నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో మహోత్సవాన్ని నిర్వహించడం అభినంద నీయమని ఆయన పేర్కొన్నారు."ఆధ్యాత్మికత, ఐక్యత, సాంస్కృతిక సంప్రదాయాలను కొనసాగిస్తూ ఇలాంటి పండుగలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం సమాజానికి శక్తినిస్తుంది" అని ఎమ్మెల్యే అన్నారు.ఈ కార్య క్రమంలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువతతో పాటు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకను విజయవంతం చేశారు.

# పెండింగ్ డిఎ లను వెంటనే విడుదల చేయాలి



డిండి ఆగస్టు 13.(నీలగిరి ఎక్స్ ప్రెస్) : ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ( యుఎస్ పిసి) పిలుపు మేరకు నాలుగు దశల పోరాటంలో భాగంగా గురువారం గుండ్లపల్లి మండల ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కి భోజన విరామ సమయంలో మెమోరండం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు గండమల్ల రామారావు మాట్లాడుతూ పి ఆర్ సి ని వెంటనే ప్రకటించి, పెండింగ్ డిఏ లను విడుదల చేసి మరియు నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉపాధ్యాయ సమస్యలు అన్నీ కూడా విద్యార్థుల సమస్యలే అని తెలియజేస్తూ తక్షణమే ఈ సమస్యలకు పరిష్కారం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పవన్, కోశాధికారి రాంబాబు, ఎఫ్. డబ్ల్యు.ఎఫ్. కన్వీనర్ ఖాజా రెహమతుల్లా మరియు సీనియర్ నాయకులు తిరుపతయ్య, యాదయ్య, బుజ్జిరాని, షాహిన్, అనిత ,పావని, తెరిసా, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# బోడుప్పల్‌లో ఇందిరమ్మా చీరల పంపిణీ



బోడుప్పల్, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మా చీరల పంపిణీ కార్యక్రమం బోడుప్పల్‌లో ఘనంగా జరిగింది. సర్కిల్--10లోని రాజీవ్‌నగర్ కాలనీ, డబుల్ బెడ్‌రూమ్ నివాసితుల మహిళలకు డ్వాక్రా గ్రూప్ అధికారి ఈదుల రేణుక చీరలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "మొదటి విడతలో మహిళా డ్వాక్రా సంఘాలకు చెందిన మహిళలకు చీరలు ఇచ్చాం. ఇప్పుడు గ్రూపుల్లో లేని మహిళలకు ఆధార్, రేషన్ కార్డు ఆధారంగా పంపిణీ చేస్తున్నాం" అని తెలిపారు.చీరలు అందుకున్న మహిళలు సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన నాణ్యమైన చీరలపై ఆనందం వ్యక్తం చేశారు. "రాఖీ పండుగ రోజున అందరం ఇందిరమ్మా చీరలనే కడతాం" అని వారు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాలతి, ఉప్పలమ్మ, మంగమ్మ, అమృత, దేవాలక్ష్మి, జయమ్మ, మమత, మహాలక్ష్మి, ఉమారాణి, గంగమ్మ, నాగమణి, ప్రమీల, అనురాధ, సల్మా, చంద్రమ్మ, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి కప్పపహాడ్ సర్పంచ్ బింగి గీత



ఇబ్రహింపట్నం, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేదవర్గాల విద్యార్థులకు ఆర్థిక చేయూతగా ఉండాలన్నదే తమ లక్ష్యమని కప్పపహాడ్ గ్రామ సర్పంచ్ బింగి గీత రాములయ్య తెలిపారు.కప్పపహాడ్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 70 మంది విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చిన స్కూల్ యూనిఫామ్, షూస్‌ను పాఠశాల హెడ్‌మాస్టర్ సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, "ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పిల్లలు ఎక్కువగా పేదవర్గాలకు చెందినవారే. వారికి విద్యా సామాగ్రి అందించి ఆర్థిక చేయూతగా ఆదుకోవడం మా బాధ్యత" అని అన్నారు. గ్రామ యువత ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, త్వరలో విద్యార్థులకు స్టూడెంట్ గుర్తింపు కార్డులు, టైలు, బెల్టులు అందజేస్తామని తెలిపారు. విద్యార్థులు చక్కగా చదువుకొని ప్రయోజకులుగా మారాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన, "ఈ పాఠశాలలో చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించిన యువకులు పాఠశాలను దత్తత తీసుకొని అభివృద్ధికి కృషి చేయాలి" అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ పలపు రమేష్, వార్డ్ సభ్యులు జంగలి శంకర్, అరుగే అలివేలు శ్రీశైలం, హెడ్‌మాస్టర్ ఆనందు, ఉపాధ్యాయులు కల్పనా, పారిజాత, తిరుపతియ్య, బేగం తదితరులు పాల్గొన్నారు.

# బార్ల అక్రమ మద్యం విక్రయాలపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ డిమాండ్




హుస్నాబాద్, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : హుస్నాబాద్ మున్సిపాలిటీతో పాటు పరిసర మండల గ్రామాల్లో బార్ అండ్ రెస్టారెంట్లు నిబంధనలకు విరుద్ధంగా రాత్రి ఒకటైనా మద్యం విక్రయిస్తున్నాయని బీఎస్పీ పార్టీ ఆరోపించింది.బార్ యజమానులు బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తూ, కొన్ని చోట్ల బాటిళ్లలో నీరు, చీప్ లిక్కర్ కలిపి అమ్ముతున్నారని ఆరోపణలు వచ్చాయి. ప్రొద్దున 10 గంటలకు తెరవాల్సిన బార్లు తొమ్మిది గంటలకే ప్రారంభిస్తున్నాయని, బెల్టు షాపుల కంటే బార్లు అధ్వానంగా మారాయని పార్టీ నాయకులు విమర్శించారు.మద్యం మత్తులో దొంగతనాలు, ప్రమాదాలు, లైంగిక వేధింపులు పెరుగుతున్నా ఎక్సైజ్ శాఖ చర్యలు తీసుకోవడంలో వెనుకడుగు వేస్తోందని అన్నారు.బార్ అండ్ రెస్టారెంట్లపై చర్యలు తీసుకోకపోతే ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ముందు ధర్నా చేపడతామని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ హెచ్చరించారు. కార్యక్రమంలో వేల్పుల రాజు, రాంబాబు, మారేపల్లి సుధాకర్, ఎలగందుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యూనిఫాం పంపిణీ



ఖానాపూర్, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ఖానాపూర్ మండలం మస్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత యూనిఫాంల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ దొనికేని లక్ష్మీ, ఉపసర్పంచ్ దొనికేని వెంకటేష్, ప్రధానోపాధ్యాయులు జాడి శ్రీనివాస్ చేతుల మీదుగా విద్యార్థులకు యూనిఫాంలు అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మీ మాట్లాడుతూ విద్య అనేది ప్రతి బిడ్డకు విలువైన ఆస్తి అని, విద్యార్థులు ప్రతిరోజూ శుభ్రమైన యూనిఫాం ధరించి క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. ఉపసర్పంచ్ వెంకటేష్ విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లో కూడా రాణించాలని కోరారు.ప్రధానోపాధ్యాయులు జాడి శ్రీనివాస్ ప్రభుత్వం సకాలంలో యూనిఫాంలు అందజేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సుల్తానాబాద్, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): సుల్తానాబాద్--పెద్దాపూర్ రోడ్డులో విస్తరణతో పాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులకు ఈ నెల 17న శంకుస్థాపన జరగనుంది.ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయర మణారావు ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మం త్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరుకానున్నారు.ఈ నేపథ్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బిరుదు రాధాకృష్ణ, కౌన్సిలర్ల బృందం, కమిషనర్ టి. రమేష్, ఆర్అండ్‌బీ ఏఈ గుణశేఖర్ పూసాల రోడ్డులో సభాస్థలిని పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వేదిక నిర్మాణం, సభా ఏర్పాట్లపై సూచనలు చేశారు.

# గర్శకుర్తిని మండల ఏర్పాటు చెయ్యాలని ఎమ్మెల్యేకు వినతి



గంగాధర, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :చొప్పదండి నియోజకవర్గంలోని గర్శకుర్తి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యానికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్తులకు ఇచ్చిన హామీ మేరకు గర్శకుర్తిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. గర్శకుర్తిని చేనేత హబ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని, చేనేత కార్మికులకు మరింత ఆర్థిక చేయూత అందించేందుకు సంబంధిత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆహ్వానిస్తామని చెప్పారు.కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంత్రి మహేందర్, గ్రామ సర్పంచ్ చిందం ఆంజనేయులు, నాయకులు గుండ రాజేశం, చిప్ప చక్రపాణి, దూస రాజమౌళి, అన్నాల్‌దాస్ శ్రీనివాస్, కొలిపాక రాజు, మల్లికార్జున్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సర్దుబాటులో లోపాలు సవరించాలని ఎస్‌టియుటిఎస్ డిమాండ్



ఖానాపూర్, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా బోధన కొనసాగించేందుకు ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలో లోపాలను సవరించాలని ఎస్‌టియుటిఎస్ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు ఎస్. భూమన్న యాదవ్ కోరారు.జీవో నెం.25లోని రేషనలైజేషన్ నిబంధనలను పూర్తిగా పాటించకుండా కేటాయింపులు జరగడం ఉపాధ్యాయులకు అన్యాయం చేస్తోందని ఆయన విమర్శించారు. అవసరమైన పాఠశాలలకు ఉపాధ్యాయులను పంపించాల్సి ఉండగా, వ్యక్తిగత అభీష్టాలు, ఒత్తిళ్ల ఆధారంగా కేటాయింపులు చేయడం సరికాదన్నారు.సర్దుబాటు కేటాయింపుల్లో సీనియారిటీ, అర్హతలకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో చర్చించి మాత్రమే తుది జాబితాలను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు నాంపల్లి నాగభూషన్, రాష్ట్ర కార్యదర్శి ఏనుగు రబాజారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పోలీస్ కార్ గంగాధర్, బోస్లే గంగాధర్, శ్రీనివాస్, బాలాజీ బోస్లే, కె.రమేష్, మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

## నందికొట్కూరు నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని సిపిఐ ఎంఎల్ డిమాండ్



**నందికొట్కూరు, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నందికొట్కూరు నియోజక వర్గాన్ని వెంటనే కరువు ప్రాంతంగా ప్రకటించి, యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా నాయకులు రఫీ, లాజరస్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వర్షాభావంతో మొక్కజొన్న, కంది, కొర్ర, పత్తి, సోయా, చిక్కుడు పంటలు ఎండిపోయి రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు రూ.40--50 వేల వరకు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. కరువు కారణంగా కూలీల వలసలను నివారించేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద తక్షణమే పనులు ప్రారంభించి ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పి. మర్రిస్వామి, అయ్యప్ప, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే గిత్త



**నందికొట్కూరు, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నందికొట్కూరు పట్టణంలోని 29వ వార్డులో రూ.22 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గిత్త జయసూర్య భూమి పూజ చేసి ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడంతో పాటు వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**నందికొట్కూరు, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నందికొట్కూరు పట్టణం 15వ వార్డులో నిర్వహించిన "రెండేళ్ల నమ్మకం – – అభివృద్ధి, సంక్షేమం" ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో ఎమ్మెల్యే గిత్త జయసూర్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, గోవర్ధనగిరి, పట్టణ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఐవీపై అవగాహన సదస్సు ఏర్పాటు



**గడివేముల, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** గడివేముల మండలం కరిమద్దుల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఐవీ/ఎయిడ్స్ మరియు లైంగిక వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏపీ సాక్స్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు దిశా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సి.ఎల్.డబ్ల్యూ. సి. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ యువత హెచ్ఐవీపై అవగాహన కలిగి ఉండటం ద్వారా సంక్రమణను నివారించవచ్చని తెలిపారు. అసురక్షిత లైంగిక సంబంధాలు, తల్లి నుంచి బిడ్డకు, కలుషిత సూదులు/సిరంజీలు, పరీక్షించని రక్తం ద్వారా హెచ్ఐవీ వ్యాప్తి చెందుతుందని వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా, గోప్యంగా హెచ్ఐవీ పరీక్షలు అందుబాటులో ఉన్నాయని, పాజిటివ్‌గా నిర్ధారణ అయిన వారికి ఏఆర్టీ/లింక్ ఏఆర్టీ కేంద్రాల ద్వారా ఉచిత చికిత్స అందుతుందని చెప్పారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వారిపై వివక్ష చూపకూడదని, సందేహాల నివృత్తికి 1097 హెల్ప్‌లైన్‌ను సంప్రదించవచ్చని సూచించారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ ఎం. మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ సీఎం పర్యటనకు భారీగా తరలివచ్చిన వైసీపీ శ్రేణుల



**నందికొట్కూరు, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి కర్నూలు పర్యటన సందర్భంగా నందికొట్కూరు నియోజకవర్గం నుండి వైసీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. వైసీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ ధారా సుధీర్ ఆధ్వర్యంలో శ్రేణులు బయలుదేరగా, 340సి హైవేపై పోలీసులు వాహనాలను అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఆత్మకూర్ డీఎస్పీ ఆర్.ఆర్. నాయక్, సిఐ సుబ్రహ్మణ్యంతో చర్చించి, శాంతియుతంగా పర్యటనకు వెళ్తున్న ప్రజలను అడ్డుకోవడం ప్రజాస్వామ్యంలో సరికాదని పేర్కొన్నారు. అనంతరం అనుమతి లభించడంతో వైసీపీ శ్రేణులు పర్యటనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైసీపీ నాయకులు, ఓల్డ్ బీఎస్ఆర్ టీం, కన్వీనర్లు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత కోచింగ్ దరఖాస్తులకు ఆహ్వానం

**కరీంనగర్, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** బీసీ స్టడీ సర్కిల్ కరీంనగర్‌లో గ్రూప్-బ్యాంకింగ్, ఎస్ఎస్‌సి, ఆర్ఆర్‌బి, పోలీస్ నియామక పరీక్షలకు ఉచితంగా 125 రోజుల శిక్షణ ఇవ్వబడనుంది. ఉమ్మడి కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలకు చెందిన డిగ్రీ పాసైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, అనాథ అభ్యర్థులు ఆగస్టు 14 వరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ తెలిపారు. డిగ్రీలో సాధించిన మార్కులు, రిజర్వేషన్ నిబంధనల ఆధారంగా ఎంపిక జరుగుతుందని చెప్పారు. దరఖాస్తులు వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలి. మరిన్ని వివరాలకు బీసీ స్టడీ సర్కిల్ కరీంనగర్ 0878-2268686 నంబర్‌ను సంప్రదించవచ్చు.

# ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



**మాడుగుల, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మాడుగుల మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ ఘనంగా జరిగింది. మండల బీజేపీ అధ్యక్షుడు నల్లకాసుల పెద్దయ్య యాదవ్ అధ్యక్షతన విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. మువ్వన్నెల జెండాలను చేతుల్లో పట్టుకుని దేశభక్తి నినాదాలతో ర్యాలీ కదంతొక్కి, భారత ఐక్యతను ప్రపంచానికి చాటి చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్యంగా నాగర్‌కర్నూల్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు దండు శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు సూదిని శివరాం రెడ్డి, రంగారెడ్డి జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు కాసుల వెంకటేష్, మండల ఉపాధ్యక్షులు ఎర్కలి కాటం గౌడ్, ఈర్లపల్లి మధు, మండల ప్రధాన కార్యదర్శి మెట్టు శ్రీనివాస్, కార్యదర్శులు గజ్జ నిరంజన్, విష్ణు యాదవ్, దోణాదుల శ్రీనివాస్, కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి జమలాపురం రామ్‌కిషన్, రెడ్డెమోనీ జంగయ్య యాదవ్, రావిరాళ్ల మహదేవ్ శర్మ, గడ్డమీద వెంకటయ్య, మట్ యాదయ్య, జక్కుల జంగయ్య యాదవ్, ఇంద్రావత్ రవి, బీసీ మోర్చా అధ్యక్షుడు ఇర్వింటి భూపేష్ చారి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ఆదిమల్ల గిరి, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు బెల్లంకొండ కృష్ణ, మాజీ ఉప సర్పంచ్ బర్రె శ్రీశైలం, వార్డ్ సభ్యుడు ఎమ్మె శేఖర్, మాజీ మండల ప్రధాన కార్యదర్శి పాలకుర్ల రఘుపతి, సోషల్ మీడియా కన్వీనర్ ఇర్వింటి శివాచారి, కాసుల శ్రీరాములు, మంగ్త నాయక్, శ్రీను నాయక్, కేశమోనీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మర్రిగూడలో ఉపసర్పంచ్‌ల ఫోరం నూతన కమిటీ ఎన్నిక




**మర్రిగూడ, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండలంలోని ఎల్ఎంజీ ఫంక్షన్ హాల్‌లో గురువారం ఉపసర్పంచ్‌ల మండల కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్ ఆదేశాల మేరకు ఈ సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి నల్గొండ జిల్లా అధ్యక్షుడు గాదె రాజశేఖర రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు కుంభం వేణుగోపాలరెడ్డి హాజరై కమిటీని నియమించారు. ఈ సందర్భంగా మేతరి శంకర్ మండల ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా మహేశ్వరం రమేష్, ఉపాధ్యక్షుడిగా ఎలగపల్లి లింగయ్య, ప్రధాన కార్యదర్శిగా ముద్దం శ్రీలత శ్రీధర్ గౌడ్, సహాయ కార్యదర్శిగా కొర్ర సునీత శంకర్ నాయక్, కోశాధికారిగా కొయ్య మేల్కి, ప్రచార కార్యదర్శిగా రమావత్ శ్రవణ్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. కార్యవర్గ సభ్యులుగా షేక్ షబ్బీర్, జనగం నరసమ్మ, పొగాకు సైదులు, కొట్టం శోభ, రామిడి భూపతిరెడ్డి, దగ్గుల లింగస్వామి, గుడావత్ దేవలి, చామకూరి కృష్ణమ్మలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గాదె రాజశేఖర రెడ్డి మాట్లాడుతూ, "ఉపసర్పంచ్‌ల సమస్యలపై నిరంతరం శక్తివంచన లేకుండా పనిచేస్తాం. ఉపసర్పంచ్‌లకు గౌరవ వేతనం ఇవ్వాలి. శిలాఫలకాలపై వారి పేర్లు ఉండాలి. తీర్మానాలపై వారి సంతకం తప్పనిసరి కావాలి" అని స్పష్టం చేశారు. మర్రిగూడ మండలంలోని పలు గ్రామాల ఉపసర్పంచ్‌లు ఈ సమావేశంలో పాల్గొని నూతన కమిటీకి మద్దతు తెలిపారు.

## అర్హులైన పేదలకు ఇండ్లు, స్థలాలు ఇవ్వాలని సిపిఎం డిమాండ్



**నల్గొండ, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్గొండ పట్టణంలోని అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం భూమి కొనుగోలు చేసి 120 గజాల స్థలం, 10 లక్షల రూపాయలు ఇంటి నిర్మాణానికి ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సయ్యద్ హాశం డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం కార్యాలయంలో జరిగిన పట్టణ విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "నల్గొండ పట్టణంలో జీవనోపాధి కోసం 30 ఏళ్ల క్రితం వలస వచ్చిన పేదలు ఇప్పటికీ అద్దె ఇళ్లలోనే ఉంటున్నారు. హమాలీలు, భవన నిర్మాణ కార్మికులు, ఇంటి పనివారు, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, పవర్లూమ్ కార్మికులు, టైలర్లు, పెయింటర్లు, ఫుట్‌పాత్ వ్యాపారులు, తోపుడు బండ్లదారులు, షాప్ గుమస్తాలు, చిరు వ్యాపారులు ఇలా సుమారు 20 వేల మంది పేదలు ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. 1999 తర్వాత నల్గొండ పట్టణంలో ఇళ్ల స్థలాల కోసం భూమి సేకరణ జరగలేదని ఆయన గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టణ కేంద్రాల్లో ఇందిరమ్మ టవర్స్ పేరుతో నిర్మాణాలు చేసి అర్హులైన పేదలకు పంపిణీ చేస్తామని ప్రకటించిన పథకాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జోక్యం చేసుకొని నల్గొండ కార్పొరేషన్ పరిధిలో వెంటనే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండి సలీం, పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, పట్టణ కమిటీ సభ్యులు తుమ్మల పద్మ, అవుట్ రవీందర్, అద్దంకి నరసింహ, గంజి నాగరాజు, గంజి రాజేష్, సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ డిమాండ్



**నల్గొండ, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.డి. సలీమ్, జిల్లా ఉపాధ్యక్షుడు దండెంపల్లి సత్తయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నల్గొండ తాసిల్దార్ కార్యాలయంలో తెలంగాణ ఆల్ హమాలి వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "వ్యవసాయ మార్కెట్ యార్డులు, సివిల్ సప్లై, బేవరేజెస్, రైస్ మిల్లులు, గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజ్లు, కూరగాయల--పండ్ల మార్కెట్లు, రైల్వే, సిమెంట్, స్టీల్ రంగాల్లో పనిచేస్తున్న హమాలీలు తీవ్రమైన ఆర్థిక, సామాజిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమాజానికి సరుకులు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ ప్రభుత్వం హమాలీల రక్షణ కోసం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు" అని ఆరోపించారు. హమాలీల కూలి రేట్లు పెరగకపోవడం, పని భద్రత, ఆరోగ్య రక్షణ, సంక్షేమ సౌకర్యాలు లేకపోవడం వల్ల వేలాది మంది కార్మికుల పరిస్థితి దుర్భరంగా మారిందని వారు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో హమాలీల కోసం ప్రత్యేకంగా హమాలి వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేస్తామని, హెల్త్ కార్డులు అందజేస్తామని హామీ ఇచ్చినప్పటికీ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినా అమలు కాలేదని గుర్తు చేశారు "హమాలీలందరికీ గుర్తింపు కార్డులు జారీ చేసి అసంఘటిత కార్మికులుగా నమోదు చేయాలి. ఈశ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసి సామాజిక భద్రతా పథకాలు అమలు చేయాలి. 55 ఏళ్లు పైబడిన హమాలీలకు నెలకు కనీసం రూ.6,000 పెన్షన్ ఇవ్వాలి. ఇండ్లు లేని హమాలీలకు 120 గజాల స్థలం ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలి. పని ప్రదేశాల్లో మంచినీరు, విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు, సైకిల్ స్టాండ్, ప్రథమ చికిత్స వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలి. ప్రమాదంలో మరణించిన హమాలీలకు రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలి" అని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ అవుట్ రవీందర్, హమాలి సంఘాల నాయకులు సుంకరబోయిన వెంకన్న, అవురేషు మారయ్య, పజ్జూరు యాదగిరి, బొమ్మకంటి లక్ష్మీపతి, నూకల శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యం

- గ్రామ కమిటీలే కాంగ్రెస్ పార్టీకి బలమైన పునాదులు
- గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి
- ఐనవోలు మండల అధ్యక్షులు నకరకంటి మోహన్‌గౌడ్



**ఐనవోలు, ఆగస్టు 13(నీలగిరి ఎక్స్ ప్రెస్):** రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని ఐనవోలు మండల అధ్యక్షులు నకరకంటి మోహన్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఐనవోలు మండలంలోని పంతిని, కక్కిరాలపల్లి, పున్నేలు, ఒంటిమామిడిపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ శాఖ కమిటీలను గురువారం ఏర్పాటు చేశారు. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, డీసీసీ అధ్యక్షులు ఇనుగాల వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షులు నకరకంటి మోహన్‌గౌడ్, కమిటీ ఇన్‌చార్జీల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నకరకంటి మోహన్‌గౌడ్ మాట్లాడుతూ.. దేశ రాజకీయాల్లో రాహుల్‌గాంధీ చేస్తున్న పోరాటానికి గ్రామస్థాయి నుంచి బలమైన మద్దతు అవసరమన్నారు. గ్రామ కమిటీలే పార్టీకి బలమైన పునాదులని, గ్రామ శాఖలు చురుగ్గా పనిచేసి మండల, జిల్లా స్థాయికి బలమైన నాయకత్వాన్ని అందించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నూతన కమిటీ సభ్యులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఇన్‌చార్జీలు తెల్ల సుగుణ, కిషోర్, నాగరాజు, హనుమకొండ జిల్లా డిజిటల్ మీడియా ఇన్‌చార్జి రాయపురం సాంబయ్య, జిల్లా జేబీఎం అధ్యక్షులు జన్నపురెడ్డి ఋగ్వేద్‌రెడ్డి, ఐనవోలు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు పోలపల్లి శివశంకర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు పూస చిరంజీవిరెడ్డి, మహమ్మద్ రఫీ, కిసాన్ సెల్ అధ్యక్షులు గ్యాదరీ భాస్కర్, కాంగ్రెస్ నాయకులు బొమ్మినేని రాకేష్‌రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు రావుల రవీందర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కత్తి సుధీర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఆయా గ్రామాల అధ్యక్షులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు హాజరయ్యారు.

## ఉపాధ్యాయుల డిప్యూటేషన్ రద్దు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి కృతజ్ఞతలు



**ఇబ్రహింపట్నం, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల డిప్యూటేషన్‌ను రద్దు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు బుధవారం ఆందోళన చేపట్టారు. గ్రామ సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్, ఉపసర్పంచ్ మధుకర్ రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లిన పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు డిప్యూటేషన్ రద్దు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన సర్పంచ్ గ్రామ పంచాయతీ తరఫున ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. తరువాత కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మొటె శ్రీశైలం ఆధ్వర్యంలో తొర్రూరులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలసి వినతిపత్రం సమర్పించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రంగారెడ్డి జిల్లా డిఈవో వెంకటేశ్వర్లుతో ఫోన్‌లో మాట్లాడి మేడిపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఉపాధ్యాయుల డిప్యూటేషన్‌ను రద్దు చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు డిప్యూటేషన్ రద్దు కావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీశైలం మాట్లాడుతూ, "విద్యార్థుల భవిష్యత్తు కోసం చొరవ చూపిన ఎమ్మెల్యే గారికి ధన్యవాదాలు" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచ్‌లు బోడ కృష్ణ, ఎరుకలి బాలరాజు గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ముచ్చర్ల సంపత్, స్థానిక నాయకులు, కార్యకర్తలు బుసు జంగారెడ్డి, చిగురంత సికిందర్ రెడ్డి, ఆడల గణేష్, స్వచ్ఛంద కార్యకర్త ప్రొద్దుటూరి రవీందర్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్‌లో మహాత్మా బసవేశ్వర విగ్రహావిష్కరణ మహోత్సవం



షాద్‌నగర్, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):వీరశైవ సమాజం ఆధ్వర్యంలో షాద్‌నగర్‌లో మహాత్మా బసవేశ్వర విగ్రహావిష్కరణ మహోత్సవం వైభవంగా జరగనుంది. ఈ కార్యక్రమం శ్రీశ్రీశ్రీ కాశీ జగద్గురు డాక్టర్ చంద్రశేఖర శివాచార్య మహాస్వామి దివ్య సన్నిధిలో నిర్వహించబడుతోంది. విగ్రహావిష్కరణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని నిర్వాహకులు తెలిపారు. సమాజ నాయకులు, బసవధల్ యువకులు, మహిళా విభాగం ప్రతినిధులు, మహిళా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్, విశ్వం బొబ్బిలి ప్రవీణ్, రియాల శివకుమార్, సంతోష్, కిరణ్, పని కుమార్, కత్తి చంద్రశేఖర అప్ప, సుంకు మల్లికార్జున్, కాట బాబు, రెడ్డి రమేష్, ఆకుల రవి, సర్వేశ్వర్, ప్యాట విరేష్, శ్రీధర్, సుధీర్, నాగభూషణం, పోలే రాజేశ్వర్, సందీప్, కొట్టే మల్లికార్జున అప్ప, ఆకుల విరేశం, ఎల్ఎంబీ లింగం, భద్రప్ప, రమేష్, చేగురి మల్లప్ప, సుంకు అమర్‌నాథ్, న్యాయవాది నోముల బసవప్ప, నోముల వినోద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మహిళా నాయకులు నవనీత మాధవి, విశాల, జగదేవితో పాటు వీరశైవ మహిళా విభాగం సభ్యులు కూడా కార్యక్రమ ఏర్పాట్లలో భాగస్వాములయ్యారు. "భక్తిశ్రద్ధలతో, వైభవంగా మహోత్సవాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి" అని వీరశైవ సమాజం నాయకులు తెలిపారు.

# శివాలయ కళ్యాణ మండపానికి శంకుస్థాపన



మర్రిగూడ, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):శ్రావణమాసం తొలి గురువారం మర్రిగూడలోని శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శివపార్వతుల కళ్యాణ మండపానికి భూమి పూజ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం 10 గంటలకు జరిగిన శంకుస్థాపనలో ఎన్నారై మర్రిగూడ వాసి గుమ్మకొండ మధుసూదన్ రెడ్డి, గుమ్మకొండ రఘునందన్ రెడ్డి, వీరమల్ల లోకేష్ గౌడ్, మాస చంద్రశేఖర్, వెంకటంపేట బాలయ్య, ఆలయ పూజారి ఎల్వీ శర్మ, కొలుకులపల్లి యాదయ్య, పగడాల లింగయ్య, బండ యాదయ్య, కర్నాటి సంతోష్, రాపోలు యాదగిరి, చిలుకూరి ఇంద్రయ్య, అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కొట్రలో దారుణ హత్య.. యువతిని పెట్రోల్ పోసి నిప్పంటించి హతమార్చిన ప్రియుడు?



వెల్దండ, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): వెల్దండ మండలం కొట్ర గ్రామ శివారులో యువతి దారుణ హత్యకు గురైన ఘటన తీవ్ర కలకలం రేపింది. నారమళ్ల అనూష (22)ను అర్ధరాత్రి వ్యవసాయ పొలంలో పెట్రోల్ పోసి నిప్పంటించి హతమార్చినట్లు సమాచారం. పూర్తిగా కాలిపోయిన స్థితిలో ఆమె మృతదేహం లభించడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనలో కొట్ర గ్రామానికి చెందిన షాంపూరి రాములు ప్రధాన నిందితుడిగా పోలీసులు అనుమానిస్తున్నారు. హత్యకు మరో యువకుడు సహకరించినట్లు సమాచారం. అనూషకు, రాములుకు కొంతకాలంగా సంబంధం ఉన్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. ఈ వ్యవహారమే హత్యకు కారణమా? లేక మరేదైనా కారణం ఉందా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అనూషకు భర్తతో పాటు నాలుగేళ్ల కుమారుడు ఉన్నట్లు సమాచారం. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అర్ధరాత్రి వ్యవసాయ పొలంలో చోటుచేసుకున్న ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర ఆందోళన నెలకొంది. సమాచారం అందుకున్న వెల్దండ సీఐ రఘువీర్‌రెడ్డి సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటనకు సంబంధించిన ఆధారాలను సేకరించి దర్యాప్తు ప్రారంభించారు. హత్యకు అసలు కారణం ఏమిటి? ఈ ఘటనలో మరెవరైనా ప్రమేయం ఉందా? అనే అంశాలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. దర్యాప్తు పూర్తయిన తర్వాత హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# ట్యాంకర్లతో పంటకు నీరు - రైతన్న గోస



మర్రిగూడ, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక, భూగర్భ జలాలు అడుగంటడంతో మర్రిగూడ మండల కేంద్రంలోని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో గ్రామానికి చెందిన గ్యార యాదగిరి అనే రైతు తన మూడు ఎకరాల పొలంలో సాగు చేస్తున్న కూరగాయలు, గుమ్మడి పంటలను కాపాడుకునేందుకు ట్యాంకర్ల ద్వారా నీరు అందిస్తున్నారు. పంటలు ఎండిపోకుండా కాపాడుకోవడానికి ఒక్కో ట్యాంకర్‌కు రూ.2 వేల చొప్పున చెల్లిస్తూ సాగు కొనసాగిస్తున్నానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "వర్షాలు లేక, బోర్లు ఎండిపోవడంతో పంటలు నాశనం కావడం ప్రారంభమైంది. అప్పులు చేసి పెట్టిన పంటను కాపాడుకోవడానికి ట్యాంకర్లతో నీరు తెప్పించుకోవడం తప్ప మరో మార్గం లేదు" అని రైతు యాదగిరి వేదనతో తెలిపారు. గ్రామంలో వర్షాభావం కారణంగా రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, పంటల కోసం తగినంత నీరు అందకపోతే కౌలు రైతుల జీవితం మరింత కష్టాల్లో పడుతుందని ఆయన పేర్కొన్నారు.

# నాగర్‌కర్నూల్‌లో ఇండోర్ షటిల్ కోర్టు ప్రారంభం



నాగర్‌కర్నూల్, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):జిల్లా పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీసు అధికారులు, సిబ్బంది ఆరోగ్యం, ఫిట్‌నెస్ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఇండోర్ షటిల్ కోర్టును గురువారం జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ కలిసి ప్రారంభించారు. సుమారు రూ.8 లక్షల నిధులతో నిర్మించిన ఈ సదుపాయం ద్వారా పోలీసు సిబ్బంది శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం పెంపొందించుకోవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. "పోలీసు శాఖలో పనిచేసే అధికారులు నిరంతరం ప్రజా సేవలో నిమగ్నమై ఉంటారు. పని ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు వారికి శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆనందాన్ని అందిస్తాయి" అని కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ మాట్లాడుతూ, "పోలీసు ఉద్యోగులు రాత్రింబవళ్లు విధులు నిర్వహించాల్సి వస్తుంది. ఇటువంటి పని ఒత్తిడిని తగ్గించేందుకు క్రీడలు ఎంతో ఉపయోగపడతాయి. ఆరోగ్యకరమైన శరీరం, ప్రశాంతమైన మనస్సు ఉన్నప్పుడే విధులను సమర్థవంతంగా నిర్వర్తించగలరు" అని తెలిపారు. ప్రారంభోత్సవం అనంతరం కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్, అదనపు ఎస్పీతో పాటు అధికారులు స్వయంగా బ్యాడ్మింటన్ ఆడి ఉత్సాహాన్ని ప్రదర్శించారు. అధికారులు స్వయంగా క్రీడల్లో పాల్గొనడం పోలీసు సిబ్బందిలోనూ ఉత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, ఆర్డీవో అర్చన, డీఎస్పీ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, తహసీల్దార్ తబితా రాణి, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, సీఐలు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వాస్తు తిరుపతి రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



కల్వకుర్తి, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):కల్వకుర్తి మండల పరిధిలోని ముకురాల గ్రామానికి చెందిన వాస్తు తిరుపతి రెడ్డి తల్లి ఇటీవల మృతి చెందడంతో, దశదిన కర్మ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి, మండల అధ్యక్షుడు బాల్ రెడ్డి, తర్నికల్ సర్పంచ్ పవన్‌కుమార్ రెడ్డి, కౌన్సిలర్ శ్రీకాంత్ రెడ్డి, తోటపల్లి మాజీ సర్పంచ్ రాజేష్ రెడ్డి, వెంకటాపూర్ జైపాల్ రెడ్డి, కుర్మిద్ద విజయ్ భాస్కర్, గుండూర్ నంబి శంకర్, మార్చాలా భాస్కర్, ప్రతాప్ రెడ్డి తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన నాయకులు, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, వారికి మనోధైర్యం కల్పించారు.

# సంద్రలగడ్డ తండా అభివృద్ధికి ఎమ్మెల్యే కసిరెడ్డి హామీ

**- అభివృద్ధి పనులకు అవసరమైన సహకారం అందిస్తానని భరోసా**




అమనగల్లు, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన చుడాలి పండుగ ఉత్సవాలకు హాజరయ్యారు. అనంతరం తన నివాసంలో వివిధ మండలాల ముఖ్య నాయకుల సమక్షంలో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాడ్గుల మండలం సంద్రలగడ్డ తండా గ్రామపంచాయతీ సర్పంచ్ జైపాల్ నాయక్ తదితరులు ఎమ్మెల్యేను కలిసి గ్రామపంచాయతీ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులపై ఎమ్మెల్యేకు వివరించారు. గ్రామ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యతనిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హామీ ఇచ్చారు. ప్రభుత్వం ద్వారా అవసరమైన నిధులు సమకూర్చేందుకు కృషి చేస్తానని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామ అభివృద్ధి పనుల విషయంలో ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన పడకంటి శివ ప్రకాష్



కల్వకుర్తి, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):మహబూబ్నగర్ జిల్లా ఎస్పీ శ్రీమతి బి. జానకిని కల్వకుర్తి పట్టణానికి చెందిన తెలంగాణ ఐటీ కౌన్సిలర్ జోనల్ సెక్రటరీ పడకంటి శివ ప్రకాష్ గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఎస్పీకి శుభాకాంక్షలు తెలియజేసి, భవిష్యత్తులో ప్రజా సేవలో మరింత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# మెనూ అమలుపై ఆహార కమిషన్ ఆగ్రహం

**- మెనూకు విరుద్ధంగా జీరా రైస్.. కిచెన్‌లో పాడైన కూరగాయలు**
**- విద్యార్థుల ఫిర్యాదులతో వెలుగులోకి వచ్చిన లోపాలు**
**- నాణ్యమైన ఆహారం అందించాల్సిందే: చైర్మన్ గోలి**



ఆమనగల్లు, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): మంచాల మండలం ఆరుట్ల గ్రామపంచాయతీ పరిధిలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యత, మెనూ అమలుపై తెలంగాణ రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, కమిషన్ సభ్యులు శారద, ఆనంద్, భారతి గురువారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారాన్ని కమిషన్ బృందం స్వయంగా రుచి చూసి నాణ్యతను పరిశీలించింది. మెనూ ప్రకారం మిల్లెట్ ఇడ్లీ, రాగి జావ అందించాల్సి ఉండగా జీరా రైస్ అందించడంపై చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా సమస్య కారణంగా టిఫిన్ అందించలేకపోయామని ప్రిన్సిపాల్, మెస్ ఇన్‌చార్జ్ వివరణ ఇవ్వగా, కారణాలు ఏవైనా నిర్దేశిత మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించాల్సిందేనని చైర్మన్ స్పష్టం చేశారు.

**- విద్యార్థుల నుంచి ఫిర్యాదులు**

విద్యార్థులతో మాట్లాడిన కమిషన్ బృందానికి మెనూ ప్రకారం ఆహారం అందడం లేదని, తరచూ అన్నం మాత్రమే పెడుతున్నారని, టిఫిన్ కూడా సక్రమంగా అందడం లేదని విద్యార్థులు తెలిపారు. కిచెన్‌లో లోపాల గుర్తింపు: కిచెన్, డైనింగ్ హాల్, ఆహార నిల్వ గదులను పరిశీలించగా పాడైన కూరగాయలు, నాణ్యత లేని బియ్యం నిల్వలు గుర్తించారు. కొన్ని ఆహార సామగ్రిని నేలపై ఉంచడాన్ని గుర్తించిన అధికారులు, మెనూ బోర్డు, ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయకపోవడాన్ని కూడా గుర్తించారు. అధికారులకు ఆదేశాలు: విద్యార్థులకు నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని సివిల్ సప్లై అధికారులను చైర్మన్ ఆదేశించారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. నిర్ణయించిన మెనూ ప్రకారం నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందించడంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు.

**- స్కూల్ కమిటీతో సమీక్ష**

అనంతరం ప్రిన్సిపాల్, హెడ్‌మాస్టర్లు, స్కూల్ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్కూల్ కమిటీ సమావేశాల్లో ఆహార భద్రత, విద్యార్థుల ఆరోగ్య ప్రొఫైల్ అంశాలను అజెండాలో చేర్చకపోవడాన్ని కమిషన్ గుర్తించింది. విద్యార్థుల ఆరోగ్యం, ఆహార నాణ్యత, మెనూ అమలుపై ప్రత్యేక శ్రద్ధ వహించి లోపాలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కమిషన్ బృందం ఆదేశించింది.

# దొడ్డి మణెమ్మకు ఘన సన్మానం



కల్వకుర్తి, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):జాతీయ మాల మహానాడు నాగర్‌కర్నూల్ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా నియమితులైన దొడ్డి మణెమ్మను గురువారం కల్వకుర్తి మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రత్నమాల ఆనంద్‌కుమార్, రేష్మ బేగం గారు దొడ్డి మణెమ్మకు శాలువా కప్పి సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్యాలయ సిబ్బంది, జాతీయ మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు రావుల శ్రీనివాసులు తదితరులు పాల్గొని ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహిస్తూ, సామాజిక అభివృద్ధి కోసం మాల మహానాడు ఎల్లప్పుడూ కృషి చేస్తుందని నాయకులు పేర్కొన్నారు.

# 10వ వార్డులో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం



కల్వకుర్తి, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):కల్వకుర్తి పట్టణంలోని 10వ వార్డులో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. కౌన్సిలర్ ఏజాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్‌కుమార్ హాజరై పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ, "ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు కల్వకుర్తి పట్టణాన్ని మరింత ముందుకు తీసుకెళ్తున్నాయి. అభివృద్ధి ధ్యేయంతో పనిచేస్తున్న శాసనసభ్యుడు కసిరెడ్డి నారాయణరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు" అని రాఘవేంద్ర కాలనీ వాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, గణేష్ యాదవ్, రెహానా బేగం, షకీర్ పాషా, ముక్తేదర్, అఖిల్, శశి గౌడ్, సంజన తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ దుర్గా మైసమ్మ దేవాలయానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



**అచ్చంపేట, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అచ్చంపేట పట్టణంలోని 8వ వార్డు ఇందిరానగర్ కాలనీలో నిర్మించనున్న శ్రీ దుర్గా మైసమ్మ దేవాలయం పనులకు గురువారం శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు, జిల్లా డిసిసి అధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ తన సతీమణి, సి.బి.ఎం ట్రస్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ అనురాధతో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులు మాట్లాడుతూ, "ప్రజల విశ్వాసాలకు, ఆధ్యాత్మిక భావాలకు అనుగుణంగా దేవాలయ నిర్మాణానికి సహకరించడం ఎంతో ఆనందంగా ఉంది. శ్రీ దుర్గా మైసమ్మ అమ్మవారి ఆశీస్సులతో అచ్చంపేట ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తున్నాం. దేవాలయ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి భక్తులందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన సహకారం అందిస్తాం" అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమామహేశ్వరం దేవాలయం చైర్మన్ మాధవరెడ్డి, అచ్చంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత మల్లేష్, మాజీ ఎంపీపీ రామనాథం, తాలూకా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతల రాజగోపాల్, మండల అధ్యక్షుడు బుచ్చి రాములుతో పాటు వివిధ మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

# కరాటే టోర్నీలో మెరిసిన ఆమనగల్లు చిన్నారులు

**- 40 మందికి పతకాలు.. 32 గోల్డ్, 8 సిల్వర్ మెడల్స్‌తో సత్తా**



**ఆమనగల్లు, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హైదరాబాద్ చంపాపేట్‌లోని బాల్‌రెడ్డి గార్డెన్స్‌లో ఇటీవల నిర్వహించిన జేఎస్‌కే ఇంటర్నేషనల్ కరాటే టోర్నమెంట్‌లో ఆమనగల్లు విద్యార్థులు సత్తా చాటారు. ఆమనగల్లు పట్టణంలోని జగదీశ్వర్ కరాటే అకాడమీకి చెందిన 23 మంది విద్యార్థులు, ప్రజ్వాల ఆశ్రమానికి చెందిన 17 మంది విద్యార్థినులు కలిపి మొత్తం 40 మంది టోర్నమెంట్‌లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. పోటీల్లో అద్భుత ప్రతిభ ప్రదర్శించిన మొత్తం 40 మంది విద్యార్థులు పతకాలు సాధించారు. ఇందులో 32 మంది గోల్డ్ మెడల్స్, 8 మంది సిల్వర్ మెడల్స్ సాధించి ఆమనగల్లు పట్టణానికి మంచి పేరు తీసుకొచ్చారు. విద్యార్థుల విజయంతో తల్లిదండ్రులు, ప్రజ్వాల ఆశ్రమం నిర్వాహకులు, కరాటే అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. విజేతలను పలువురు అభినందిస్తూ భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కరాటే మాస్టర్ సీ. జగదీశ్వర్ మాట్లాడుతూ.. విద్యార్థుల నిరంతర సాధన, క్రమశిక్షణ, పట్టుదలతోనే ఈ ఘన విజయం సాధ్యమైందన్నారు. క్రీడలతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంపొందుతాయని, విద్యతో పాటు క్రీడలపై కూడా విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులకు మెరుగైన శిక్షణ అందిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం చేస్తామని తెలిపారు.

# శేఖర్‌కు అంబేద్కర్ యువజన సంఘం ఆర్థిక సాయం



**ఆమనగల్లు, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మున్సిపాలిటీ అంబేద్కర్ యువజన సంఘం కోశాధికారి వస్పుల శేఖర్‌ను సంఘం నాయకులు గురువారం పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. శేఖర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న సంఘం అధ్యక్షులు లండం చిన్న జంగయ్య, వైస్‌ప్రెసిడెంట్ వస్పుల రంజిత్‌కుమార్, ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ లండం యాదయ్య, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ లండం శివ తదితరులు ఆయనకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు నాగిళ్ల అశోక్, లండం యాదయ్య (పోలీస్), లండం చిన్న జంగయ్య, లండం యాదయ్య, ఏడవెల్లి రమేష్ కలిసి రూ.3,800 ఆర్థిక సహాయం అందించారు. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న శేఖర్ కుటుంబానికి ఈ సహాయం కొంతమేర ఉపశమనం కలిగిస్తుందని నాయకులు పేర్కొన్నారు. శేఖర్ త్వరగా కోలుకుని ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఆపదలో ఉన్న సంఘం సభ్యులకు అంబేద్కర్ యువజన సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, భవిష్యత్తులోనూ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్,టై, బెల్ట్, షూ పంపిణీ



**తలకొండపల్లి, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన యూనిఫామ్‌లు, టైలు, బెల్టులు, షూలను గ్రామ సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వంలో నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, నాణ్యమైన విద్యతో పాటు నాణ్యమైన దుస్తులు అందించడం ద్వారా ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం మా లక్ష్యం" అని తెలిపారు. గ్రామంలోని పేదవర్గాల పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్నందున వారికి అవసరమైన విద్యా సామాగ్రి, దుస్తులు అందించడం ద్వారా ఆర్థిక భారాన్ని తగ్గించడమే కాకుండా విద్యలో ముందుకు సాగేందుకు ప్రోత్సాహం కల్పిస్తున్నామని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యార్థుల చదువుకు సర్కారు చేయూత

**- రాంనుంతల పాఠశాలలో ఉచిత యూనిఫామ్స్, షూస్ పంపిణీ**



**ఆమనగల్లు, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాంనుంతల గ్రామపంచాయతీ పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ఉచిత యూనిఫామ్స్, షూస్‌ను సర్పంచ్ వద్యావత్ శ్రీను నాయక్ ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన మౌలిక వసతులు, పలు సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యూనిఫామ్స్, షూస్ పంపిణీతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరగడంతో పాటు పాఠశాలలో సమానత్వ భావన బలపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి గ్రామపంచాయతీ తరపున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజేశ్వరి మోహన్, గ్రామ బీవో కవిత, ఉపాధ్యాయురాలు సంతోషి, గ్రామ నాయకులు నరేందర్, యువకులు మహేష్, శాంతిలాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్న వారికి పాపిశెట్టి రాము చేయూత



**ఆమనగల్లు, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు వెల్దండ యెన్నం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ప్రముఖ సంఘ సేవకులు, ఆమనగల్లు 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము గురువారం ఆస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం అందించారు. చికిత్స పొందుతున్న బాధితులకు, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, అవసరమైన సమయంలో అండగా ఉంటామని భరోసా కల్పించారు. పేద కుటుంబాలు వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న సమయంలో వారికి తోడుగా నిల వడం తన బాధ్యతగా భావిస్తున్నానని పాపిశెట్టి రాము తెలిపారు. సేవా కార్యక్ర మాలను నిరంతరం కొనసాగిస్తూ ఆపదలో ఉన్న వారికి తనవంతు సహాయ సహకారాలు అంది స్తానన్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు పాపిశెట్టి రాముకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రామన్న మిత్ర మండలి సభ్యులు శ్రీను నాయక్, దేరంగుల భుజంగం, బాధితుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆమనగల్లు వైద్య సేవలపై డీసీహెచ్ఎస్ ఆరా

**- సీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ.. నూతన భవన పనులపై సమీక్ష**





**ఆమనగల్లు, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డా. దామోదర రాజనర్సింహ, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయకర్త (డీసీహెచ్ఎస్) డా. అనురాగిణి రెడ్డి గురువారం ఆమనగల్లు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రికార్డులు, హాజరు పట్టికలు, ఓపీ, ఐపీ, గర్భిణులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. పాము, కుక్క, కోతి కాట్లకు సంబంధించిన వ్యాక్సిన్లు, మందుల నిల్వల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల నమోదైన విషజ్వరాల కేసులు, రోగులకు అందించిన చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, శ్వాసకోశ, ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధుల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు గైనకాలజిస్ట్ డా. స్వాతి, జనరల్ మెడిసిన్ డా. ఊర్మిళను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు డీసీహెచ్ఎస్ తెలిపారు. అనంతరం అధికారులతో కలిసి సీహెచ్‌సీ నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. మరో నెల నుంచి రెండు నెలల్లోపు భవన నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి భవన నిర్మాణానికి రూ.17.50 కోట్లు కేటాయించగా, అదనపు మౌలిక సదుపాయాల కోసం మరో రూ.3 కోట్లతో మార్చురీ, వంటగది, భోజనశాల, లిఫ్ట్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఆధునిక సదుపాయాలతో ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రిని అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. తనిఖీలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డా. నాగరాజు, వైద్యాధికారి డా. మైమున, హెడ్ నర్స్, నర్సింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మేడిగడ్డ తండాలో తాగునీటి సమస్యకు చెక్



**- రూ.5 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో నూతన బోరు పనులు ప్రారంభం**

**అమనగల్లు, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అమనగల్లు మండలంలోని మేడిగడ్డ తండా గ్రామపంచాయతీ పరిధిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్ రాజేశ్వరి మల్లేష్, ఉప సర్పంచ్ విజయ్ రాథోడ్ తెలిపారు. గురువారం మేడిగడ్డ తండాలో నూతన బోరు డ్రిల్లింగ్ పనులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ.5 లక్షలు వెచ్చించి తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చేయడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. బోరు అందుబాటులోకి వచ్చిన అనంతరం తండాలో నీటి సమస్య మరింత తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందేలా అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు మల్లేష్, దేవేందర్, జయందర్, కవిత, మణిపాల్, సితి భాస్కర్, ప్రేమలత, హన్మ తదితరులతో పాటు గ్రామస్తులు పరమేశ్వర్, పాండు, హరిలాల్, గంగా పాల్గొన్నారు.

# దేశభక్తి స్ఫూర్తితో ఆమనగల్లులో తిరంగా ర్యాలీ

**- తల్లోజు ఆచారి ఆధ్వర్యంలో ఘనంగా ర్యాలీ.. మువ్వన్నెల జెండాలతో కదంతొక్కిన విద్యార్థులు, యువత, బీజేపీ శ్రేణులు**



**ఆమనగల్లు, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఆమనగల్లు మున్సిపాలిటీలో బీజేపీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు కర్నాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో చౌరస్తాలో నిర్వహించిన ఈ ర్యాలీని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. విద్యార్థులు, యువకులు, బీజేపీ, బీజేవైఎం, ఏబీవీపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని చేతుల్లో మువ్వన్నెల జెండాలు పట్టుకుని దేశభక్తి నినాదాలతో ర్యాలీలో కదంతొక్కారు. ఈ సందర్భంగా తల్లోజు ఆచారి మాట్లాడుతూ.. భారతదేశాన్ని ప్రపంచంలోనే శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దే సంకల్పంతో ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. మువ్వన్నెల జెండా దేశ గౌరవం, స్వాతంత్ర్యం, ఐక్యతకు ప్రతీక అని, ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి భావాన్ని చాటాలని కోరారు. యువత, విద్యార్థులు దేశ చరిత్ర, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, రాజ్యాంగ విలువలను తెలుసుకుని జాతీయ భావంతో ముందుకు సాగాలని సూచించారు. దేశ ప్రగతిలో సైనికులు, రైతులు, శాస్త్రవేత్తలు, యువతతో పాటు ప్రతి భారతీయుడి పాత్ర కీలకమని పేర్కొన్నారు. దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కండె హరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోరటి నరసింహ, జిల్లా కౌన్సిల్ సభ్యుడు చెక్కల లక్ష్మణ్, మాజీ చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, మాజీ కౌన్సిలర్ కృష్ణయాదవ్, చెన్నకేశవులు, కృష్ణానాయక్, బీజేపీ సీనియర్ నాయకుడు బండెల రామచంద్రారెడ్డి, పార్లమెంట్ బీజేవైఎం కో-కన్వీనర్ రవి రాథోడ్, అసెంబ్లీ బీజేవైఎం ఇన్‌చార్జి పద్మ అనిల్, మున్సిపాలిటీ బీజేవైఎం అధ్యక్షుడు గోరటి భరత్, సోషల్ మీడియా కన్వీనర్ పద్మ ప్రశాంత్, బీసీ మోర్చా అధ్యక్షుడు బన్నె నరసింహ, ఆచారి మిత్రమండలి అధ్యక్షుడు మట్ట పరమేష్‌తో పాటు నాటు శివ, సిరి శ్రీశైలం, లండన్ మల్లేష్, సుమన్ నాయక్, బాలు నాయక్, వెంకట్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీలో బాలికలకు వైద్య పరీక్షలు

**– వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, పౌష్టికాహారంపై అవగాహన**



**ఆమనగల్లు, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) హాస్టల్‌ను గురువారం ఆమనగల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన వైద్య బృందం సందర్శించింది. ఈ సందర్భంగా హాస్టల్‌లోని బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల నివారణ, పౌష్టికాహారం ప్రాధాన్యతపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా సమస్యలు తలెత్తిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. అలాగే ఉపాధ్యాయులు, హాస్టల్ సిబ్బందికి వంటగది పరిశుభ్రత, తాగునీటి వనరుల సంరక్షణ, నిత్యావసర సరుకులను సక్రమంగా నిల్వ చేయడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. హాస్టల్‌లో బాలికలకు పరిశుభ్రమైన వాతావరణం, సురక్షితమైన తాగునీరు, నాణ్యమైన పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆమనగల్లు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మైమున్ బేగం, హెచ్‌ఈఓ తిరుపతిరెడ్డి, సూపర్‌వైజర్ రాణి, ఆశా కార్యకర్తలు బీబీ, సంధ్య, కేజీబీవీ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పత్తి రైతులకు 50% సబ్సిడీపై పురుగు మందులు

**– కపాస్ కాంతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**




**ఆమనగల్లు, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పత్తి రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు రైతు వేదికలో గురువారం కపాస్ కాంతి పథకంలో భాగంగా జూలైలో పత్తి విత్తనాలు పొందిన రైతులకు 50 శాతం సబ్సిడీపై పురుగు మందులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆమనగల్లు మండలంలో కపాస్ కాంతి పథకం కింద 80 హెక్టార్లలో పత్తి సాగు అమలులో ఉందన్నారు. పథకం ద్వారా విత్తనాలు పొందిన రైతులు ప్రభుత్వం అందిస్తున్న పురుగు మందులను 50 శాతం సబ్సిడీతో తీసుకుని పంటను చీడపీడల నుంచి రక్షించుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను పాటిస్తూ మందులను సరైన మోతాదులో వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, పంటల సాగులో ఆధునిక పద్ధతులను పాటించాలని కోరారు. రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, సూచనలు అందించడంలో వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ఆమనగల్లు ఏడీఏ శోభారాణి, మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, మున్సిపల్ కౌన్సిలర్లు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అవ్వారి శివలింగం, మాజీ ఎంపీపీ అనిత విజయ్, ధనుంజయ్య, సురేష్ నాయక్, ఏఈఓలు నికిత, మీనాక్షి, భూదేవి, ప్రభావతి, ఆమనగల్లు మండల రైతులు పాల్గొన్నారు.

# ఆమనగల్లు అభివృద్ధికి ఎమ్మెల్యే భరోసా

**– డంపింగ్ యార్డు తరలింపు.. అదనపు నిధుల మంజూరుకు కసిరెడ్డి హామీ**



**ఆమనగల్లు, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం నుంచి అవసరమైన నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పట్టణంలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై విస్తృతంగా చర్చించారు. సమావేశానికి వైస్ చైర్‌పర్సన్ తల్లోజు గీతా ఆచారి, మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్‌రెడ్డితో పాటు కౌన్సిలర్లు, అధికారులు హాజరయ్యారు. పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్వహణ, మున్సిపల్ వాహనాల నిర్వహణ, మొక్కల పెంపకం తదితర పనులకు సమావేశంలో ఆమోదం తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరిచి పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. పట్టణ ప్రజలకు ఇబ్బందికరంగా మారిన డంపింగ్ యార్డును మరో ప్రాంతానికి తరలించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు మున్సిపాలిటీకి అదనపు నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని చెప్పారు. నూతన మున్సిపల్ భవన నిర్మాణానికి కూడా అవసరమైన సహకారం అందిస్తానని పేర్కొన్నారు. చేయూత పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్ల ఫేజ్–2 వంటి సంక్షేమ పథకాలలో అర్హులైన వారందరికీ లబ్ధి చేకూరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు. మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్ మాట్లాడుతూ.. వార్డుల్లో వీధిదీపాలు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్వహణ తదితర సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. పట్టణ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు మున్సిపాలిటీ తరఫున నిరంతరం కృషి చేస్తామని చెప్పారు. సమావేశంలో కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, ఎంఆర్వో ఎం.డి. ఖాద్రీ, సీఐ వెంకటేశ్వర్లు, మిషన్ భగీరథ ఏఈ మణిదీపిక, మున్సిపల్ ఏఈ నరేశ్, ఐసీ మేనేజర్ ఆంజనేయులు, ఎక్సైజ్, అటవీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆమనగల్లు అభివృద్ధి పనులకు వేగం పెంచాలి

**– డిసెంబర్‌లోగా అమృత్ పనులు పూర్తి చేయాలి.. అదనపు కలెక్టర్ కిరణ్మయి ఆదేశం**



**ఆమనగల్లు, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి అధికారులను ఆదేశించారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలో పర్యటించిన ఆమె పలు అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, వైస్ చైర్‌పర్సన్ తల్లోజు గీతా ఆచారి, కమిషనర్ రాఘవేందర్‌రెడ్డి ఆమెకు స్వాగతం పలికారు. పట్టణంలోని ప్రధాన సమస్యలను మున్సిపల్ పాలకవర్గం అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లింది. డంపింగ్ యార్డు సమస్య, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కొరత, మున్సిపాలిటీకి స్వంత ఆదాయ వనరుల కొరత వంటి అంశాలపై వినతిపత్రం అందజేసింది. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. జెడ్పిహెచ్ఎస్, బస్టాండ్ పాఠశాలలను సందర్శించిన అదనపు కలెక్టర్ మెప్మా స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేస్తున్న పాఠశాల యూనిఫాంలను పరిశీలించారు. యూనిఫాంల నాణ్యత, తయారీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం సూరసముద్రం చెరువును పరిశీలించి అభివృద్ధి అవకాశాలపై అధికారులతో చర్చించారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద చెరువు కట్ట, లేక్‌ఫ్రంట్ అభివృద్ధికి సంబంధించిన అంశాలను పరిశీలించారు. పట్టణ ప్రజలకు ఉపయోగపడేలా చెరువు అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

అమృత్ పనుల పురోగతిని పరిశీలించిన అదనపు కలెక్టర్ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, వేగం పెంచాలని ఆదేశించారు. డిసెంబర్ నాటికి పనులన్నీ పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు స్పష్టం చేశారు. పనుల పురోగతిపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

ఈ పర్యటనలో మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, వైస్ చైర్‌పర్సన్ తల్లోజు గీతా ఆచారి, కమిషనర్ రాఘవేందర్‌రెడ్డి, మున్సిపల్ ఏఈ నరేశ్, మెప్మా సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలపై వినతి



**ఎలిగేడు, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వ పాఠశాలలు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో ఎలిగేడు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ యాకన్నకు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ, "పాఠశాల సమయాల్లో నిరంతర శిక్షణలు, భోధనేతర పనులు, ఆన్లైన్ పనులు టీచర్లను తరగతి గది భోధన నుండి దూరం చేస్తున్నాయి. ప్రతి సంవత్సరం వేల సంఖ్యలో ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతుండగా, ప్రైవేట్ పాఠశాలలు పెరుగుతున్నాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు. వారు సమర్పించిన మెమొరాండంలో పీఆర్సీ నివేదికను తెప్పించి జూలై 1, 2023 నుండి అమలు చేయాలని, పెండింగ్లో ఉన్న 6 డీఏలను చెల్లించాలని, సర్వీసు ఉద్యోగులు, పెన్షనర్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. 2000 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింప జేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలని, జీవో 25 సవరించాలని, యాజమాన్య ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నత షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలని, స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ ప్రత్యేక సర్వీస్ నిబంధనలు రూపొందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో నాయకులు కే. కుమారస్వామి, ఏ. సంతోష్ రెడ్డి, పి. వెంకటేశ్వర రెడ్డి, ఏ. రాజేష్ కుమార్, జి. దేవేందర్ రావు, వెంకటేశ్వర్లు, సంపత్, రాము, ప్రవంతి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌పై ప్రకాష్‌రాజ్‌కు తల్లోజు ఆచారి ప్రశ్న 'ఎస్ఐఆర్ ఫామ్ నింపి ఇచ్చారా? లేదా?'



**హైదరాబాద్, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై సినీనటుడు ప్రకాష్‌రాజ్ చేసిన వ్యాఖ్యలపై జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, బీజేపీ నేత తల్లోజు ఆచారి స్పందించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను ఉద్దేశించి వ్యాఖ్యలు చేస్తున్న వారు ముందుగా తాము ఎస్ఐఆర్ ఫామ్ నింపి సమర్పించారా? లేదా? అన్నది స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. "ఎస్ఐఆర్ ఫామ్ నింపి ఇచ్చారా? లేకపోతే మీ పేరు ఎలా ఉంటుంది?" అంటూ ప్రకాష్‌రాజ్‌ను ఉద్దేశించి తల్లోజు ఆచారి ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, ఓటర్ల జాబితా పారదర్శకంగా, సక్రమంగా ఉండేలా చూడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై విమర్శలు చేసే ముందు ఎస్ఐఆర్ ఉద్దేశం, అవసరం, విధానాన్ని పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. సరైన అవగాహన లేకుండా చేసే వ్యాఖ్యలు ప్రజల్లో అనవసరమైన అపోహలు, గందరగోళానికి దారితీసే అవకాశం ఉందన్నారు. ఓటర్ల జాబితాలో పారదర్శకత, కచ్చితత్వం ఉండటం ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎంతో అవసరమని తల్లోజు ఆచారి పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై వాస్తవాలను తెలుసుకున్న తర్వాతే మాట్లాడాలని, ప్రజల్లో అనవసరమైన అనుమానాలు, అపోహలు కలిగించేలా వ్యాఖ్యలు చేయవద్దని ఆయన కోరారు.

## భారతమ్మ మృతికి ఎమ్మెల్యే కసిరెడ్డి నివాళి

**– భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు.. కుటుంబ సభ్యులకు పరామర్శ**



**ఆమనగల్లు, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ న్యాలపట్ల నరేందర్‌రెడ్డి పెద్దమ్మ భారతమ్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి గురువారం ఆకుతోటపల్లిలోని ఆమె స్వగృహానికి వెళ్లి భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం భారతమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, వారి దుఃఖంలో తాను భాగస్వామినని ఎమ్మెల్యే పేర్కొన్నారు. భారతమ్మ మృతి కుటుంబానికి తీరని లోటని, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కష్టకాలంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, ఏ అవసరం ఉన్నా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల ముఖ్య నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని భారతమ్మకు నివాళులర్పించారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో బీఎల్ఓలకు సురేష్ సహకారం

**– ఓటర్ల గుర్తింపు, ఎన్యూమరేషన్ ఫారాల నమోదులో స్వచ్ఛంద సేవలు**



**ఆమనగల్లు, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో తలకొండపల్లి యువ నాయకుడు పెరుమాండ్ల సురేష్ స్వచ్ఛందంగా పాల్గొని బూత్ స్థాయి అధికారులకు (బీఎల్ఓలు) సహకరించారు. తలకొండపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఓటర్ల గుర్తింపు, ఎన్యూమరేషన్ ఫారాల నింపడం, ఓటర్ల సందేహాల నివృత్తి కోసం ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లో బీఎల్ఓలతో కలిసి సేవలందించారు. 18, 21వ పోలింగ్ బూత్‌లతో పాటు మరికొన్ని బూత్‌లలో ఓటర్లకు అవసరమైన సహాయాన్ని స్వచ్ఛందంగా అందించారు. అర్హులైన ఏ ఒక్కరి ఓటు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా ప్రతి ఒక్కరూ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సూచించిన నేపథ్యంలో తాను ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు సురేష్ తెలిపారు. ఓటు హక్కు భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుల్లో కీలకమైనదని, దాన్ని పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయడంలో బీఎల్ఓలు చేస్తున్న కృషిని సురేష్ అభినందించారు. ప్రజలకు ఎలాంటి సందేహాలు ఉన్నా బీఎల్ఓలను సంప్రదించి, ఓటరు జాబితాలో తమ వివరాలను సరిచూసుకోవాలని సూచించారు.

## నానో ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన



**ఆమనగల్, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆత్మ పథకం ఆధ్వర్యంలో నానో యూరియా, నానో డీఏపీ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఆగస్టు 14న (శుక్రవారం) రాంనుంతల రైతు వేదికలో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో నానో యూరియా, నానో డీఏపీ వినియోగ విధానం, పంటలపై వాటి ప్రభావం, ఎరువుల వినియోగంతో కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. నానో ఎరువుల వినియోగం ద్వారా ఎరువుల ఖర్చును తగ్గించుకోవడంతో పాటు పంటల దిగుబడి, నాణ్యతను మెరుగుపరచుకునే అంశాలపై రైతులకు సూచనలు అందించనున్నట్లు తెలిపారు. రైతులు శాస్త్రీయ పద్ధతుల్లో ఎరువులను వినియోగిస్తూ అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి రైతులు, ప్రజాప్రతినిధులు, పాత్రికేయ మిత్రులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

## ఎలిగేడు యువకుడికి రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్‌లో కీలక బాధ్యత



**ఎలిగేడు, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండలం బుర్హాన్ మీయాపేట గ్రామానికి చెందిన మొగురం శేఖర్ పెద్దపల్లి జిల్లా రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. గురువారం రాష్ట్ర జనరల్ సెక్రటరీ మామిడి శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ, "నా నియామకానికి కృషి చేసిన మామిడి శ్రీధర్ గారికి, సహకరించిన పలువురికి ప్రత్యేక కృతజ్ఞతలు" అని తెలిపారు. స్థానిక యువతకు క్రీడా అవకాశాలు కల్పించడంలో, రోప్ స్కిప్పింగ్ క్రీడను గ్రామీణ స్థాయిలో విస్తరించడంలో శేఖర్ కీలక పాత్ర పోషించనున్నారని అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు.

## ముప్పిరి తోట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం, బుక్స్, ఐడీ కార్డుల పంపిణీ



**ఎలిగేడు, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండలంలోని ముప్పిరి తోట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు యూత్ ఆధ్వర్యంలో రూ.20 వేల విలువ చేసే యూనిఫాంలను ఉచితంగా అందజేశారు. మంచిర్యాల తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ కట సాయిచరణ్ కుమారుడు పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులందరికీ నోట్బుక్కులు పంపిణీ చేశారు. పాఠశాల హెడ్‌మాస్టర్, ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఐడెంటిటీ కార్డులు కూడా అందజేశారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి తోడ్పాటు అందించిన యువతకు బ్యాంకు మేనేజర్ తరఫున హెడ్‌మాస్టర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి సర్పంచ్ మారం రాయమల్లు, పంచాయతీ కార్యదర్శి శిరీష, వార్డు సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ యువత పాల్గొన్నారు.

## విద్యార్థుల రీడింగ్ స్కిల్స్ పరిశీలన



**ఎలిగేడు, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండలంలోని ర్యాకల్దేవుపల్లి ఎంపీయూపీఎస్ పాఠశాలను సర్పంచ్ మద్దెల రమాదేవి--సంపత్ సంద ర్శించి విద్యార్థుల విద్యాప్రగతిని పరిశీలిం చారు. ఈ సందర్భంగా విద్యార్థుల నోట్‌బుక్స్, రీడింగ్ స్కిల్స్‌ను పరిశీలించిన సర్పంచ్, "విద్యార్థుల చదువు సామర్థ్యాన్ని పెంచేందుకు సాయంత్రం వేళల్లో డ్రిల్లింగ్ నిర్వహిస్తే కఠిన పదాలను సులభంగా పలకగలరు" అని ఉపాధ్యా యులకు సూచనలు చేశారు. విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని, అందుకు తనవంతు సహాయ సహకారాలను అందిస్తానని సర్పంచ్ పేర్కొన్నారు.

## రాములపల్లి గ్రామపంచాయతీ పాలకవర్గం శ్రీరామసాగర్ ప్రాజెక్టు సందర్శన



**ఎలిగేడు, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉత్తర తెలంగాణకు వరప్రదా యిని అయిన శ్రీరామసాగర్ ప్రాజెక్టును గురువారం ఎలిగేడు మండలం రాములపల్లి గ్రామపంచాయతీ పాలకవర్గం సందర్శిం చింది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వరదనీరు భారీగా చేరడంతో ప్రాజెక్టు జలకళతో నిండిపోయింది. కోట్లాది ప్రజలకు అన్నపూర్ణగా మారిన ఈ ప్రాజెక్టును ప్రత్యక్షంగా దర్శించడం ఆనందంగా ఉందని పాలకవర్గ సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్శనలో సర్పంచ్ సిద్ది తిరుపతి యాదవ్, ఉపసర్పంచ్ తీట్ల విద్యాలత--విజయ్, వార్డు సభ్యులు తిరుపతి, శృతి--సంపత్, సందీప్, రాజ్‌కుమార్, తీట్ల సింధూజ--పరుశరాం పాల్గొన్నారు. ప్రాజెక్టు నీటితో నిండిపోవడం రైతులకు, ప్రజలకు ఆశాజ్యోతి నింపిందని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.

## వత్సవాయిలో రేపు ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం

**విజయవాడ: ఆగస్టు 13,2026:** "ఒక నెల – ఒక గ్రామం – నాలుగు సందర్శనలు" కార్యక్రమంలో భాగంగా జగ్గయ్యపేట నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని ఆగస్టు 14వ తేదీ శుక్రవారం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. వత్సవాయి శ్రీ వాసవి కళ్యాణ మండపంలో ఉదయం 10.00 గంటల నుంచి ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని ప్రజల నుంచి అధికారులు అర్జీలను స్వీకరించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు పాల్గొని ప్రజల నుంచి సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టనున్నారని కలెక్టర్ తెలిపారు. జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజలు ఈ ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డా.జి. లక్ష్మీశ కోరారు.



## రేవంత్ రెడ్డిపై దుష్ప్రచారాన్ని ఖండించిన మల్లు రవి

**– వాస్తవాలను వక్రీకరిస్తూ బురదజల్లే ప్రయత్నం.. పార్లమెంటరీ వ్యవస్థను కాపాడాల్సిన వారే బలహీనపరుస్తున్నారు**



**ఆమనగల్లు, ఆగస్టు 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వ్యక్తిగతంగా, కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా కించపరిచే లక్ష్యంతో గోబెల్స్ తరహాలో దుష్ప్రచారం చేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర ఎంపీల ఫోరం కన్వీనర్, నాగర్‌కర్నూల్ ఎంపీ, టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ మల్లు రవి విమర్శించారు. గురువారం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. సంబంధిత కమిటీ నిబంధనలు, నిర్ణయాల ప్రకారమే సదరు కంపెనీకి భూమి కేటాయింపు జరిగిందని స్పష్టం చేశారు. వాస్తవాలను వక్రీకరిస్తూ ముఖ్యమంత్రిపై ఉద్దేశపూర్వకంగా బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయ ప్రయోజనాల కోసం చేస్తున్న నిరాధార ప్రచారాన్ని ప్రజలు నమ్మబోరని అన్నారు. పార్లమెంట్ సమావేశాల నిర్వహణ తీరుపైనా మల్లు రవి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశాల ప్రారంభం, చివరి రోజుల్లో మాత్రమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకు హాజరయ్యారని తెలిపారు. యువత ఆందోళనల సందర్భంగా జరిగిన కాల్పులు, లాఠీచార్జిపై కేంద్ర హోంమంత్రి సభలో సమాధానం చెప్పాలని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారని పేర్కొన్నారు. ప్రధానమంత్రి, హోంమంత్రి సభకు వచ్చి ప్రజా సమస్యలపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. భారత పార్లమెంట్‌కు ప్రపంచవ్యాప్తంగా ఎంతో గౌరవం ఉందని, పార్లమెంటరీ వ్యవస్థను కాపాడాల్సిన వారే దానిని బలహీన పరచడం ఆందోళనకరమని అన్నారు. ప్రజల ప్రశ్నలకు సమా ధానం చెప్పకుండా కేంద్ర పాలకులు సభకు దూరంగా ఉంటు న్నారని విమర్శించారు. దేశ ప్రజలు ఈ పరిణామాలను గమని స్తున్నారని, పార్లమెంటరీ సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని డాక్టర్ మల్లు రవి పేర్కొన్నారు.

## స్వయం సహాయక సంఘాలకు ఏపీ ప్రభుత్వం గుడ్ న్యూస్

- 10 మంది నిబంధన సడలింపు
- 8 మంది సభ్యులున్నా రిపీట్ డోస్ లబ్ధి
- పొదుపు సంఘాలకు సులభంగా బ్యాంక్ రుణాలు
- ఏపీ గ్రామీణ బ్యాంక్‌కు మంత్రి కొండపల్లి అభినందనలు
- ఇతర బ్యాంకులూ అనుసరించాలని మంత్రి పిలుపు



**అమరావతి, ఆగస్టు 13 :** స్వయం సహాయక సంఘాల (స్వ.స+సం) మహిళలు ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తూ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాన్ని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో ప్రశంసించారు. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో సభ్యుల మరణం లేదా వలసల వల్ల ఒక సంఘంలో సభ్యుల సంఖ్య 10 కంటే తగ్గితే, ఆ సంఘాలు ఎంత బాగా పనిచేసినా తదుపరి రుణ సదుపాయం (రిపీట్ డోస్) పొందేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేదని... ఈ క్రమంలోనే ఏపీ గ్రామీణ బ్యాంక్ తమ అంతర్గత ఉత్తర్వులు నెంబర్ 152 ద్వారా ప్రత్యేక సడలింపులు ప్రకటించడం అభినందనీయమని మంత్రి కొనియాడారు. అలాగే కొత్త మార్గదర్శకాల ప్రకారం కనీసం 8 మంది యాక్టివ్ సభ్యులు ఉన్న సంఘాలకు రిపీట్ డోస్ రుణం మంజూరు చేస్తారని... అయితే సభ్యుల సంఖ్య తగ్గడానికి వలసలు లేదా మరణం మాత్రమే కారణమై ఉండడంతో పాటు... అక్రమాలు లేకుండా.. పాత బకాయలు లేకుండా సక్రమమైన చెల్లింపులు ఉండాలని కూడా మంత్రి సూచించారు. అర్హత గల సంఘాలు ప్రత్యేక తీర్మానం మరియు బాధ్యతా పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందన్నారు. రుణ సడలింపు పొందిన సంఘాలు 6 నెలల వ్యవధిలో తమ సభ్యుల సంఖ్యను మరల కనీసం 10 మందికి పెంచుకోవాలని కూడా మంత్రి తెలిపారు. మహిళలకు ఇచ్చే రుణం ఒక ఆర్థికసాయం మాత్రమే కాదని.. వారి జీవనోపాధి, స్వయం ఉపాధికి, మహిళల ఆర్థిక సాధికారతకు నిదర్శనం అన్నారు. రాష్ట్రంలోని మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసి, ప్రతి ఇంట్లో ఒక వ్యాపారవేత్తను తయారు చేయడమే ప్రభుత్వం యొక్క ముఖ్య లక్ష్యమని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇదే రీతిలో స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ (స్రాదీజ) మరియు రాష్ట్రంలో ఉన్న ఇతర బ్యాంకులు కూడా ముందుకు వచ్చి, మంచి రికార్డు ఉన్న స్వయం సహాయక సంఘాలకు 10 మంది నిబంధనను సడలించి, సులభంగా రుణ పునరుద్ధరణ సహాయం అందించాలని మంత్రి కొండపల్లి పిలుపునిచ్చారు.

## అంగన్వాడి కేంద్రాలు చిన్నారులకు మంచి భవిష్యత్తును అందించాలి

- పౌష్టికాహార లోపం లేకుండా చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- వయసుకు తగ్గ బరువు లేని పిల్లలపై నిరంతర పర్యవేక్షణ అవసరం
- తల్లిదండ్రులకు పోషకాహారంపై అవగాహన కల్పించాలి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ







**జగ్గయ్యపేట: ఆగస్టు 13,2026.** అంగన్వాడి కేంద్రాలు చిన్నారుల సమగ్ర అభివృద్ధికి పునాదిగా నిలిచి, వారికి మంచి భవిష్యత్తును అందించేలా పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. చిన్నారుల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వయసుకు తగ్గ బరువు లేని పిల్లలను గుర్తించి వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. గురువారం జగ్గయ్యపేట మండలం ధర్మవరపుపా డు తండా సక్షం అంగన్వాడి కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అంగ న్వాడి కేంద్రంలో చిన్నారులకు అందుబాటులో ఉంచిన సౌక ర్యాలు, పౌష్టికాహార కార్యక్రమాల అమలు, విద్యాబోధన, ఆటపాటల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. అంగన్వాడి కేంద్రానికి అందజేసిన టీవీ, ఆర్వో ప్లాంట్, పెయింటింగ్స్, ఆట వస్తువులు తదితరాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. వాటిని చిన్నారుల అవసరాలకు అనుగుణంగా సక్రమంగా వినియోగిస్తున్నారా అనే విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో చేపడుతున్న కార్యక్రమాలు, చిన్నారులకు అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. వయసుకు తగ్గ బరువు లేని చిన్నారుల వివరాలను సంబంధిత యాప్‌లో జిల్లా కలెక్టర్ పరిశీలించారు. యాప్‌లో నమోదైన వివరాలకు అనుగుణంగా చిన్నారుల బరువును స్వయంగా తూయించి క్రాస్ చెక్ చేశారు. పిల్లల ఎదుగుదల, బరువు విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు. అంగన్వాడి కేంద్రంలోని చిన్నారులతో జిల్లా కలెక్టర్ కొద్దిసేపు సరదాగా ముచ్చటించారు. వారు నేర్చుకున్న పాటలను చిన్నారులతో పాడించి, వారిని ఉత్సాహపరిచారు. ఆటపాటల ద్వారా పిల్లల్లో ఆసక్తి, ఆత్మవిశ్వాసం పెంపొందేలా అంగన్వాడి సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ మాట్లాడుతూ, చిన్నారుల బాల్య దశలో ఆటపాటలకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. ఈ వయసులో పిల్లలకు ఆటలు, పాటలు, విద్యాబోధనను సమన్వయం చేస్తూ అందిస్తే వారు మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా అభివృద్ధి చెందుతారని పేర్కొన్నారు. అంగన్వాడి కేంద్రాలు చిన్నారుల్లో సృజనాత్మకత, నేర్చుకునే ఆసక్తి, సామాజిక నైపుణ్యాలను పెంపొందించే కేంద్రాలుగా పనిచేయాలని సూచించారు. వయసుకు తగ్గ బరువు లేని పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. అలాంటి పిల్లలను గుర్తించి వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంతో పాటు, వారి తల్లిదండ్రులకు కూడా పిల్లలకు అందించాల్సిన పోషకాహారం, సమతుల్య ఆహారం గురించి అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం నాణ్యత, పరిమాణం, పంపిణీ తదితర అంశాలను పర్యవేక్షించాలని, బాలామృతం సక్రమంగా అందిస్తున్నారా లేదా పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అం గన్వాడి కేంద్రం ఆవరణలో మొక్కను నాటారు. పర్యావరణ పరిర క్షణపై చిన్నారుల్లో అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలను ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమ ంలో నందిగామ ఆర్డీవో జి.అనిల్ కుమార్, డిప్యూటీ తహసిల్దార్ పి.మనోహర్, ఎంపీడీవో, సీడీపీఓ జి.సత్యవతి, పాల్గొన్నారు.